# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT


శనివారం, మార్చి 25, 2017,

ఇరవై ఎనిమిదవ సమావేశం, సంపుటం-2, నంబరు-5,

దుర్ముఖి నామ సం.ఫాల్గుణ బ.12

**SATURDAY, THE 25TH DAY OF MARCH, 2017,**

**TWENTY EIGHTH SESSION, VOLUME - 2, NO.5**

**4TH, CHAITRA 1938 S.E.**


*****


శాసన పరిషత్తు సచివాలయము,

వెలగపూడి,

అమరావతి – 522503.

**LEGISLATURE SECRETARIAT,**

**VELAGAPUDI,**

**AMARAVATHI - 522503.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | : | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | : | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవిందరెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

**శనివారం, మార్చి 25, 2017.**

## అధికార నివేదిక

---

<u>విషయ సూచిక</u>

---


**(1)** ప్రశ్నోత్తరాలు

**(2)** సభా కార్యక్రమం – ప్రకటన

**(3)** సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావన

**(4)** అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం పై లఘు చర్చ

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL
# SATURDAY, THE 25th MARCH, 2017

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.,
THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

MR. CHAIRMAN: Now, Question Hour. With regard to Q.No.9576 (91) the concerned Minister for Information & Public Relations is busy on the Floor of the Assembly. So, I will take-up Q.No.9481 (92).

## 1.ప్రశ్నోత్తరాలు

### అనంతపురం నుండి అమరావతి వరకు బస్సు సర్వీసులు

ప్రశ్న నెం. 9481 (92)
శ్రీ గుండుమల తిప్పేస్వామి, ఎం. ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రోడ్లు & భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) అనంతపురము జిల్లా నుండి రాష్ట్ర నూతన రాజధాని అమరావతికి ఏర్పాటు చేసిన బస్సు సదుపాయాల వివరాలేమిటి;

ఆ) మడకసిర మరియు పెనుగొండ నుండి రాజధానికి బస్సు సదుపాయాలను ఎప్పటిలోగా సమకూరుస్తారు?

గౌరవనీయులైన రవాణా, రోడ్లు & భవనాల శాఖ మంత్రిగారు ( శ్రీ. సిద్ధా రాఘవరావు )

అ) ప్రస్తుతం అనంతపురము నుండి విజయవాడకు ఎనిమిది సర్వీసులను నిర్వహించడమవుతున్నది. అందులో ఇంద్ర ఎసి సర్వీసు కూడా ఒకటి ఉంది. ఈ సర్వీసులన్నింటికి ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడమయింది. వివరాలను అనుబంధంలో చూపడమయింది.

ఆ) ప్రస్తుతం పెనుగొండ మీదుగా హిందూపూర్ నుండి విజయవాడకు ముడు సూపర్ లగ్జరీ సర్వీసులు నిర్వహణలో ఉన్నాయి. ఈ బస్సులు హిందూపూర్ నుండి 16.00, 18.00 & 19.30 గంటలకు బయలుదేరి 16.40, 18.40 & 20.10 గంటలకు పెనుగొండ చేరుకొంటాయి. ఈ సర్వీసులన్నింటికి లింకు బస్సులను అనుసంధానిస్తూ మడకసిర నుండి సమకూర్చడమయింది.

శాసనపరిషత్తు ప్రశ్న నెం: 9481 లోని (ఎ) ఖండానికి అనుబంధం.

అనంతపురము ప్రాంతం నుండి విజయవాడ సర్వీసుల జాబితా

| వరుస సంఖ్య | డిపో | సర్వీసు | రకం | నుండి | వరకు | ఓపిఆర్ఎస్ నెంబరు |
|---|---|---|---|---|---|---|
| 1. | ఎటిపి | 19.30 విజయవాడ (వయా కర్నూలు) | ఇంద్ర | అనంతపుపరము<br>విజయవాడ | విజయవాడ<br>అనంతపుపరము | 6726<br>6727 |
| 2 | కెయల్‌డిజి | 17.45 విజయవాడ (వయా తాడిపత్రి) | ఎస్ఎల్ | కళ్యాన్‌దుర్గం<br>విజయవాడ | విజయవాడ<br>కళ్యాన్‌దుర్గ | 6719<br>6720 |
| 3 | యుకెడి | 17.20 విజయవాడ (వయా తాడిపత్రి) | ఎస్ఎల్ | ఉరవకొండ<br>విజయవాడ | విజయవాడ<br>ఉరవకొండ | 52965<br>6996 |
| 4 | హెచ్‌డిపి | 16.00 విజయవాడ (వయా కర్నూలు) | ఎస్ఎల్ | హిందూపూర్<br>విజయవాడ | విజయవాడ<br>హిందూపూర్ | 6793<br>6794 |
| 5 | హెచ్‌డిపి | 18.00 విజయవాడ (వయా తాడిపత్రి) | ఎస్ఎల్ | హిందూపూర్<br>విజయవాడ | విజయవాడ<br>హిందూపూర్ | 6803<br>6804 |
| 6 | హెచ్‌డిపి | 19.30 విజయవాడ (వయా తాడిపత్రి) | ఎస్ఎల్ | హిందూపూర్<br>విజయవాడ | విజయవాడ<br>హిందూపూర్ | 6795<br>6796 |
| 7 | పిటిపి | 15.45 విజయవాడ (వయా కర్నూలు) | ఎస్ఎల్ | పుట్టపర్తి<br>విజయవాడ | విజయవాడ<br>పుట్టపర్తి | 6904<br>6905 |
| 8 | పిటిపి | 18.00 విజయవాడ (వయా కర్నూలు) | ఎస్ఎల్ | పుట్టపర్తి<br>విజయవాడ | విజయవాడ<br>పుట్టపర్తి | 6902<br>6903 |

శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈ రాష్ట్రానికి రాజధాని అమరావతి. అమరావతి నుండి అనంతపురం జిల్లాలోని మడకశిరకు 750 కి.మీ. దూరం ఉంది. మడకశిర నుండి అమరావతికి రావడానికి సరైన రోడ్లు గానీ, బస్సులు గానీ, రైళ్లు గానీ లేవు. అనంతపురం జిల్లాలో ఉన్నటువంటి అన్ని డిపోల నుండి అమరావతికి బస్సులున్నాయి గానీ, మడకశిర డిపో నుండి మాత్రం బస్సులు లేవు. కాబట్టి, మీ ద్వారా నేను మంత్రి గారిని కోరేదేమంటే – మడకశిర నుండి విజయవాడ రావాలంటే చాలా ఇబ్బందిపడుతున్నాము. వెంటనే మడకశిర నుండి రాజధాని అమరావతికి (విజయవాడ) బస్సులు ప్రారంభించాలని అక్కడున్న ఆర్.ఎం.కు చెబుతూనే ఉన్నాము. వచ్చే నెల్లో మొదలుపెడతాం, వచ్చే నెల్లో మొదలుపెడతామని సంవత్సరం నుండి వారు చెబుతూనే ఉన్నారు కానీ, మొదలుపెట్టలేదు. కాబట్టి, దయచేసి, మడకశిర నుండి ప్రతిరోజూ రెండు బస్సులు విజయవాడకు బయలుదేరే విధంగా ప్రవేశపెట్టవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సిద్దా రాఘవరావుః అధ్యక్షా, అమరావతి (విజయవాడ) నుండి మడకశిర 750 కి.మీ. ఉన్న మాట వాస్తవమే. దానికి కూడా మేము ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరముంది. తప్పకుండా శ్రీరామనవమి రోజు నుండి మడకశిర డిపో నుండి విజయవాడకు ఆర్డినరీ, లగ్జరీ బస్సు నడిచేలా చూస్తానని సభాముఖంగా తెలియపరుస్తున్నాను.

శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి)ః అధ్యక్షా, ఏలూరు నుండి విజయవాడ వరకే బస్సులున్నాయి. ఏలూరు నుండి నేరుగా అమరాతికి (వెలగపూడి) కూడా బస్సులు వేయించవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః మీరు అన్నింట్లో భాగం కావాలంటారు. ఆయన అడిగింది అనంతపురం గురించి. అక్కడ నుండి రాజధానికి బస్సులు కావాలని అడిగారు.

శ్రీ సిద్దా రాఘవరావుః అధ్యక్షా, సభ్యులు రాము సూర్యారావు గారు చెప్పిన విషయాన్ని తప్పకుండా పరిశీలించి, ఇమ్మీడియట్‌గా ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటాను.

## మధుమేహ వ్యాధి గురించి అవగాహన

ప్రశ్న నెం.9431 (93)
డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఎం. ఎల్.సి.,

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ?

అ) రాష్ట్రంలో గుర్తించిన మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎంత?
ఆ) అనారోగ్యానికి సంబంధించి ప్రజలలో అవగాహనను కల్పించడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రిగారు (డా. కామినేని శ్రీనివాస్):

అ) 2016, జనవరి నుండి 2017, ఫిబ్రవరి వరకు 20,11,534 కేసులను గుర్తించమయింది.
ఆ) వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

శాసన పరిషత్తు సభ్యులు డా. ఎం.వి.వి.ఎస్ మూర్తి గారు ఇచ్చిన నోటీసు ప్రశ్న నెం. 9431 లోని (బి) ఖండానికి సమాధానం.

మధుమేహ వ్యాధికి సంబంధించి ప్రజలలో అవగాహనను కల్పించడానికి తీసుకున్న చర్యలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :-

1. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారంగా, ఇంటింటి సర్వే ద్వారా ఎ.ఎన్.ఎం.లచే 30 సంవత్సరాలకు పైబడిన మొత్తం జనాభాను పరీక్షింపచేయడమయింది.

2. ఎ.ఎన్.ఎం.లు జీవన విధానమార్పులను గురించి అవగాహనను కల్పిస్తున్నారు.
   - ఎ) ఆహారం
   - బి) రోజువారీ వ్యాయామాలు
   - సి) శారీరక వ్యాపకం
   - డి) ఎ.ఎన్.ఎం.లు మరియు ఎ.ఎస్.హెచ్.ఎ. ల ద్వారా ఆరోగ్య ధ్యాన సాధనం.

3. స్వాస్థ్య విద్యా వాహిని కార్యక్రమం క్రింద వైద్య, దంత, ఆయుష్, హోం సైన్స్ మరియు నర్సింగ్ విద్యార్థులు రాష్ట్రంలోని గ్రామాలన్నింటినీ సందర్శించి, మధుమేహంతోపాటు ఆరోగ్యంగా జీవించడం, జీవన విధాన నిర్వహణ మరియు అంటువ్యాధులు కాని వ్యాధులకు సంబంధించి ప్రజలలో, గ్రామ సిబ్బందిలో, పాఠశాలల్లో అవగాహన కల్పించడం.

4. <u>చంద్రన్న సంచార చికిత్స :</u>

"పిహెచ్‌సి - ఆన్ వీల్"-

ఆరోగ్య సేవలను అందిచడానికి అంతేగాక అంటువ్యాధులు కాని వాటన్నింటికి సంబంధించి సాధారణ ప్రజలలో అవగాహనను కల్పిస్తూ డాక్టరు, నర్సు, ఫార్మసిస్టు మరియు ల్యాబ్ టెక్నీషియన్‌లతో గ్రామాలలో నిర్ణీత రోజులలో ఆరోగ్యసేవలు.

5. 35 + వయస్సు గల మహిళల కోసం ఎంఎంహెచ్‌సి 35 + స్క్రీనింగు :-
7683 ఉప-కేంద్రాల లోని శిక్షణ పొందిన 13,000 మంది ఎఎన్‌ఎంలు క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, హార్మోన్ సంబంధిత వ్యాధులు మరియు కంటి సమస్యలకు సంబంధించి రెగ్యులర్‌గా స్క్రీనింగు చేస్తున్నారు.

6. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, జింగిల్స్ ద్వారా ఎఐఆర్ లో ప్రకటనలు, స్థానిక చాన్నళ్లలో టి.వి స్క్రోలింగులు మొదలైన వాటి ద్వారా సమాచారం, అవగాహన, కమ్యూనికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడమయింది.

7. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నవంబరు 14వ తేదీన ప్రపంచ మధుమేహ దినాన్ని జరుపుకోవడమయింది.

8. హోమియోపతిలో పరిశోధన కోసం సెంట్రల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గుడివాడ లోని హోమియోపతి ప్రాంతీయ పరిశోధన సంస్థలో ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఆయుష్ శాఖ తోడ్పాటుతో కృష్ణా జిల్లాలో జీవన విధాన వ్యాధుల (ఎల్‌ఎస్‌డి) క్లినిక్‌ను ఏర్పాటు చేయడమయింది.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి ( స్థానిక సంస్థలు – విశాఖపట్నం): అధ్యక్షా, ప్రపంచంలో మధుమేహులకు రాజధాని భారత్ అయితే, దేశంలో మాత్రం ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉంది. దీనికి మంత్రిగారిచ్చిన సమాధానంలో ఆహారం, రోజువారీ శారీరక వ్యాయామం, ఏఎన్ఎంలు, ఎఎస్‌హెచ్‌ఎల ద్వారా ఆరోగ్య ధ్యాన సాధనం చేయాలని అన్నారు. ఈ ఆరోగ్య ధ్యాన సాధనం ఎక్కడ నేర్పుతున్నారు? ఎక్కడెక్కడ ప్రజలకు చేరుతోంది? ఆహారం విషయంలో ఏ ఆహారం తీసుకోవాలి? ఆ నియమాలు పాటించడానికంటే ముందు పోషకాహారం ఇస్తే మిగిలినవి అన్నీ అవుతాయి. అసలు పోషకాహారం మీరు ఎవరికి అందజేయగలుగుతున్నారు? ఆల్టర్నేటివ్‌గా డయాబెటిస్ మీద సర్టిఫికేట్ కోర్సులు చదివిన వాళ్లని డయాబెటిస్ ఎడ్యుకేటర్స్‌గా నియమించితే తప్ప, ఈ మహమ్మారి తొలగిపోదు. గతంలో మనకు మహమ్మారి అనంటే స్మాల్‌ఫాక్స్, కలరా, ప్లేగు వంటివి ఉండేవి. ప్రస్తుత పరిస్థితుల్లో మహమ్మారి అంటే ఈ మధుమేహమే. దీన్ని అరికట్టడానికి తగు చర్యలు తీసుకోకపోతే కష్టం. ప్రపంచంలో భారత్ మధుమేహులకు రాజధానిగా ఉంది. ఆంధ్రప్రదేశ్ త్వరలో మధుమేహులకు రాజధాని అవుతుంది. ఎందుకంటే, మనమంతా తినేది ఒక్కటే. ధాన్యాన్ని ఆడించి, బియ్యం చేసుకుని అన్నం వండుకుని గంజి కలుపుకుని తినడం జరుగుతోంది. దీనివల్ల కేవలం గంజి మాత్రమే శరీరంలోకి వెళుతోంది తప్ప, ప్రొటీన్స్ ఎక్కడా కూడా మన శరీరంలోకి వెళ్లడం లేదు. ప్రొటీన్స్ లేకపోతే డయాబెటిస్ తప్పకుండా వస్తుంది. ప్రధానంగా ఈ స్టేజ్‌లో తగు చర్యలు తీసుకుని నివారించకపోతే, డయాబెటిస్ పెరిగిపోయిన తరువాత నివారించడం మాత్రం చాలా కష్టం. స్కూలు పిల్లలకు కూడా డయాబెటిస్ ఉంటోంది. ఎంతమంది స్కూలు పిల్లలకు మీరు స్క్రీనింగ్ నిర్వహించారు? రాష్ట్రవ్యాప్తంగా 5 కోట్ల జనాభా ఉంటే, 10,000 మందికి డయాబెటిస్ ఉందని ఐడెంటిఫై చేశామని అంటున్నారు. అసలు స్కూలు పిల్లలందరినీ ఎడ్యుకేట్ చేయడానికి ఏమన్నా ప్రోగ్రాం పెట్టారా? ఎడ్యుకేటర్స్‌కు ఏమన్నా ట్రైనింగ్ ప్రోగ్రాం పెట్టి సర్టిఫికెట్లు ఇస్తారా? దీనికి ఆల్టర్నేటివ్ మెజర్స్ ఏమన్నా ఉన్నాయా అన్నది మీ ద్వారా వినాలని ఉంది మంత్రి గారు.

డా.కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, మూర్తిగారు చెప్పినట్లు ప్రపంచవ్యాప్తంగా చూస్తే, భారతదేశంలో అందునా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా డయాబెటిస్ ఉంది. ముఖ్యంగా వరిని ఆహారంగా తీసుకోవడం వల్ల ఇది ఎక్కువగా ఉంది. గతేడాది పురుషుల్లో 57.7 శాతం, మహిళల్లో 13.1 శాతం మందికి రక్తపరీక్షలు చేయిస్తే, 12.5 శాతం మందికి డయాబెటిస్ ఉందనేదే తెలియదు. వీళ్లంతా పల్లెటూళ్లలో ఉండేవాళ్లు. దీని మీద దేశంలో ఎక్కడా లేని విధంగా స్వాస్థ్య విద్యావాహిని పేరుతో మెడికల్, డెంటల్, ఆయుష్, నర్సింగ్‌కు సంబంధించిన వైద్యాధికారులను గ్రామాలకు పంపి, life threatening diseases, communicable dieses ఇలా పది రకాల వ్యాధుల గురించి ఫిజికల్ లిటరసీ ఉండేలా వ్యాయామం వంటి వాటిపై అవగాహన కల్పించాలని నిర్ణయం తీసుకున్నాము. PHC on wheels-104 సర్వీసులు గతంలో వుండేవి. పూర్వం దాంట్లో డాక్టర్లు ఉండేవారు కాదు. ఇప్పుడు ఒక డాక్టరు, 12 రకాల టెస్టులు కూడా చేస్తున్నారు. ప్రతి రోజూ 20 non communicable diseases కు సంబంధించి స్క్రీనింగ్ జరగాలి. అదికాకుండా, రాష్ట్రంలో 222 అర్బన్ హెల్త్ సెంటర్లు ఇప్పటికే పనిచేస్తున్నాయి. 213 మొదలుపెట్టాము. 7వ తేదీన ఈ విషయాలన్నీ తెలియపరచడానికి రాష్ట్రవ్యాప్తంగా ఒక కార్యక్రమాన్ని చేపట్టబోతున్నాము. అందులో భాగంగా స్క్రీనింగ్ చేయడమే కాకుండా, అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్ కోసం ఎండోక్రినాలజిస్ట్‌తో టెలీమెడిసిన్ అందించే ఏర్పాటు చేశాము. Master Woman Health Check up అని 7 రకాల వ్యాధులకు సంబంధించి 38 సంవత్సరాల వయస్సు పైబడిన మహిళలందరికీ గర్భసంచి, రొమ్ము, నోటీ క్యాన్సర్లతోబాటు, డయోబెటిస్, హైపర్ టెన్షన్ మీద స్క్రీనింగ్ చేసి వైద్యం అందించే ప్రయత్నం చేస్తున్నాము. అలాగే, నవంబరు, 14 వ తేదీన World Diabetic Day జరుపుతున్నాము. తప్పకుండా, కృష్ణా జిల్లాలో ఆయుష్ డిపార్టుమెంటు ద్వారా మధుమేహానికి సంబంధించి ఒక క్లినిక్ సెంట్రల్ గవర్నమెంట్ మొదలుపెట్టింది. అక్కడ వైద్యసాయం చేస్తున్నారు. నేను చెప్పేదేమంటే – పాంక్రియాస్ విడుదల చేసే ఇన్సులిన్ రక్తంలో కలుస్తుంది. అది రెగ్యులేట్ కాకపోవడం వల్ల ఈ డయాబెటిస్ అనేది వస్తుంది. కాబట్టి, rice eating habits మార్చుకోవాలి. ముఖ్యంగా దీని మీద అందరికీ అవగాహన కల్పిస్తేనే ఫలితముంటుంది. అందుకనే, ఈ స్వాస్థ్య విద్యావాహిని కార్యక్రమాన్ని మొదలుపెట్టాము.

ఉ. 10.10

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం (ఉపాధ్యాయ నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు): అధ్యక్షా, మంత్రిగారు చాలా విశదంగా తెలియచేశారు. ఏలూరులో ఉన్న ఒక డాక్టర్ల బృందం ఆంధ్రప్రదేశ్‌లోని వారు చాలా చిన్న వయసులోనే డయాబెటిస్ వ్యాధికి గురి కావడాన్ని పరిశీలిస్తూ ఒక ఆశ్చర్యకరమైన అంశాన్ని ముందుకు తెచ్చింది. అదేమిటంటే, ఇంటర్మీడియట్ తరువాత ఎంపిసి, బైపిసికి గ్రూపులకు చెందిన విద్యార్థులు ఎంసెట్‌కు తీసుకుంటున్న కోచింగ్‌లో విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్న ఫలితంగా వీళ్లకి 32, 35 సంవత్సరాల లోపలే మధుమేహం వస్తున్నది. ఇది ఒక అధ్యయనం. అంత చిన్న వయసులోనే మధుమేహం వచ్చే విధంగా వాళ్లకు ఒత్తిడి ఉంటున్నది. డాక్టర్లను తయారు చేయడానికి ఇచ్చే కోచింగ్ వల్ల డయాబెటిక్ రోగులను తయారుచేసే పరిస్థితి వస్తున్నది. బహుశః ఇది మరెక్కడా లేదేమో.

అధ్యక్షా, ఈ విషయం బహుశః మంత్రిగారి దృష్టికి వచ్చే ఉంటుందని నేను అనుకుంటున్నాను. డా. నాగేశ్వర్ రెడ్డి గారు ఈ మధ్య ఒక పరిశోధన చేశారు. ఈ వ్యాధి పాంక్రియాస్ నుండి మాత్రమే కాకుండా చిన్న ప్రేగుల నుండి కూడా ఉత్పత్తి అయ్యేందుకు అవకాశం ఉంది గనక అందులో జోక్యం చేసుకున్నట్లయితే, మధుమేహాన్ని నివారించవచ్చు అని గొప్ప పరిశోధన చేసి ప్రయోగాత్మకంగా రుజువయిందని ఈ మధ్య వచ్చింది. ఎందుకంటే ఈ అంశంపై ఏదైనా చిన్న సర్వే చేస్తే ఈ పెద్దల సభలో చాలా ఉపయోగంగా ఉంటుంది. అంతా పెద్దవాళ్లమే కాబట్టి, ఎంతోమంది డయాబెటిక్ వాళ్లు ఉంటామని

అనుకుంటున్నాను. అందరికీ ప్రయోజనం ఉంటుంది. ఈ పరిశోధనలను రాష్ట్రప్రభుత్వం ప్రోత్సహించినట్లయితే మానవాళికి మహత్తరమైన మేలు చేసినవారమవుతామని మనవిచేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ( స్థానిక సంస్థలు – గుంటూరు): అధ్యక్షా, దీనిని ఇబ్బందికరమైన వ్యాధిగానే పరిగణిసున్నాము. ఇది రోజురోజుకీ పెరుగుతున్నది. చిన్న సలహా ఏమిటంటే, రైస్ బదులు మైనర్ మిల్లెట్స్ ఒక ప్రత్యామ్నాయ ఆహారంగా మనం చేసుకోవచ్చు. మైసూరులో ఉన్నటువంటి CFTRI ( Central Food Technology Research Institute) అనేక ప్రయోగాలు చేసి ఆహారపు అలవాట్లు ఏ విధంగా ఉండాలని చెప్పడం జరిగింది. Substitution for rice to maintain food health. వారానికి ఒకసారైనా మధ్యాహ్న భోజన పథకంలో వాటిని వినియోగించినట్లయితే విద్యార్థి దశనుండి కూడా చాలా ఉపయోగంగా ఉంటుంది. ఆ అంశాన్ని పరిశీలించాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు (ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, ఈ మధుమేహ వ్యాధి అనేది సరైన వ్యాయామం లేకపోవడం వల్ల, ఆహారం లిమిట్‌గా తీసుకోకపోవడం వల్ల వస్తున్నట్లుగా డాక్టర్లు అనేకసార్లు చెబుతున్నారు. ప్రధానంగా బాలబాలికల విషయానికి వస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు కొంత వ్యాయామం ఉంటోంది గానీ, కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు చదువు తప్ప అసలు వ్యాయామమనేదే ఉండడం లేదు. చిన్నారులు ఆ విధంగా పెరిగినట్లయితే మధుమేహమే కాదు, థైరాయిడ్ కూడా ఎక్కువగా వస్తున్నదని తెలుస్తోంది. రాబోయే తరానికి ప్రతిరూపాలైన బాలబాలికలకు విద్యాశాఖని, వైద్య శాఖని సమన్వయం చేస్తూ, థర్డ్ పార్టీ ద్వారా నిరంతరం వైద్య పరీక్షలు చేయిస్తూ వ్యాధిని, ముందే గమనించి డైట్ విషయంలోగానీ, ఆరోగ్య విషయంలో గానీ శ్రద్ధ తీసుకునే విధంగా ప్రభుత్వం వద్ద ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా, దానికేమైనా చర్యలు తీసుకోబోతున్నారా అని తమ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, పెద్దలు మూర్తిగారు అడిగిన దానికి త్వరలోనే RBS (Random Blood Sugar) క్రింద 900 వాహనాలను, డాక్టర్లతో సహా అన్ని స్కూల్స్, జూనియర్ కాలేజీలలోని పిల్లలందరికీ వైద్య పరీక్షలు చేసే కార్యక్రమం ఒక నెలలోనే ప్రారంభం కాబోతున్నది.

పెద్దలు శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం గారు ఎలక్ట్ అయినందుకు ఆయనను కంగ్రాట్యులేట్ చేస్తున్నాను. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డా. నాగేశ్వర రెడ్డి గారితో మాట్లాడాను. మామూలుగా సివియర్ డయాబిటీస్ ఉండి, లావుగా ఉండి బేరియాట్రిక్ సర్జరీ చేయించుకుంటున్నవారికి గ్యాస్ట్రిక్ బైపాస్ చేస్తే షుగర్ కంట్రోల్ అవుతుంది. అది మేజర్ ప్రొసీజర్. మైనర్ ఇంటర్‌వెన్షన్ ద్వారా డయాబిటీస్‌ను కంట్రోల్ చేయాలనేదానిని ఇప్పుడు కొత్తగా కనుక్కున్నారు. ఈ విషయాన్ని నేను డా. నాగేశ్వర్ రెడ్డిగారితో మాట్లాడాను. ఒక శాసనసభ్యులు కూడా వచ్చి అడిగితే వాళ్లకు కూడా నేను ఇదే విషయాన్ని చెప్పాను. అయితే, అది ఇంకా ప్రిలిమినరీ స్టేజిలోనే ఉన్నది. అది వస్తే మాత్రం It is a major advancement in treatment.

గౌరవ సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పినట్లు రైస్‌కి ప్రత్యామ్నాయంగా మిల్లెట్స్ వాడగలిగితే బాగుంటుంది. మానవ వనరుల శాఖామంత్రిగారు కూడ ఇక్కడే ఉన్నారు కాబట్టి ఆ శాఖ వారికి కూడా చెబుతాను. మధ్యాహ్న భోజన పథకంలో కూడా పెడితే మంచిదే. అలాగే, శ్రీనివాసులు నాయుడు గారు చెప్పినట్లు శారీరక వ్యాయామం అనేది ఉండాలి. యోగా వంటి ఆరోగ్యకరమైన వ్యాయామాల వల్ల ఈ వ్యాధులను నివారించవచ్చు. భారత ప్రధానమంత్రిగారి చొరవతో జూన్, 21 ప్రపంచ యోగా దినోత్సవంగా ప్రకటించారు. దాదాపు 80 దేశాలలో పాటిస్తున్నారు. జూన్, 21 నాడు అన్ని మండలాల్లో కూడా యోగా

దినోత్సవాన్ని జరుపుతారు. ఇంతకుముందు నేను చెప్పినట్లుగా ఫిజికల్ లిట్రసీ అనేది స్వాస్థ్య విద్యా వాహిని కార్యక్రమంలో ఒక భాగంగా ఉంటుంది. తప్పకుండా ఆ విధంగా చేస్తామని మనవిచేస్తున్నాను.

## అద్దె గర్భధారణను నియంత్రించడం

ప్రశ్న నెం.9391 (94)

శ్రీమతి పమిడి శమంతకమణి, ఎంఎల్సి,

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రంలో అనేకమంది పేద మహిళలు సరోగసికి ఆకర్షితులవుతున్న విషయం వాస్తవమేనా?
ఆ) అయితే, దీనిని నియంత్రించడానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రిగారు (డా. కామినేని శ్రీనివాస్):

అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి పి. శమంతకమణి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, మంత్రిగారు డాక్టరు కాబట్టి ఆయన మీద నాకు ప్రగాఢ విశ్వాసం ఉన్నది. సరోగసి అనేది మనం ఏ విధంగా అద్దె ఇల్లు తీసుకుంటామో, అదే విధంగా గర్భాన్ని అద్దెకు తీసుకోవడమే సరోగసీ. చలనచిత్ర పరిశ్రమలో బాదుషా అయిన షారూఖ్ ఖాన్, లగాన్ చిత్రం తీసి జాతీయ అవార్డు పొందిన అమీర్ ఖాన్, మంచు లక్ష్మీ వంటి వారు సరోగసీ ద్వారా పిల్లల్ని పొందారు. కానీ, సరోగసీ విషయంలో మనం నాణానికి ఒకవైపునే చూస్తున్నాం. రెండోవైపు చూస్తే ఇది కమర్షియల్‌గా, చీకటి వ్యాపారంగా చాలా దారుణమైన పరిస్థితిలోకి వచ్చింది. ఇంతకుముందు పిల్లలు లేని వారు అనాథ శరణాలయానికి వెళ్లి పిల్లల్ని తెచ్చుకునేవారు. కానీ, ఇప్పుడు ఫాదర్స్ స్పెర్మ్‌తో పుట్టిన పిల్లలు కాబట్టి, ఆ పిల్లల్లో తమయొక్క జీన్స్ ఉంటాయి, పోలికలు ఉంటాయని, తమ లక్షణాలు ఉంటాయని సరోగసీ విధానం పట్ల ఆకర్షితులవుతున్నారు. కానీ, మన ఆంధ్రరాష్ట్రంలోనే 80 కేంద్రాలు ఉన్నాయంటే, వీటి తీవ్రత ఎంత ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అక్కడ కొంతమంది దళారులు ఉండి పల్లెప్రాంతాలలో ఉన్న మహిళలను ఈ విధానం పట్ల ఆకర్షితులయ్యేలా చేస్తున్నారు. పేదరికంతో ఉన్న మహిళలకు డబ్బు ఆశ చూపించి, వారి పేదరికాన్ని ఎన్‌కాష్ చేసుకుంటూ దళారీలు కొన్ని లక్షలు సంపాదిస్తున్నారు. పిల్లలు కావలసిన తల్లిదండ్రులకు, సరోగసీకి సిద్ధపడిన మహిళకు మధ్య ఎటువంటి సంబంధం లేకుండా దళారులే ఆమె ఆహారానికి, మెడికల్ చెకప్‌కు, మందులకు ఎంత డబ్బు కావాలో చెబుతున్నారు గానీ, ఆమె పరిస్థితిని ఏ మాత్రం గుర్తించడం లే దు. మరీముఖ్యంగా కొన్నిచోట్ల వాళ్లు చేసుకునే అగ్రిమెంట్‌లో మగపిల్లవాడు పుట్టే వరకూ కూడా అద్దెగర్భం కొనసాగుతుందని వ్రాయించుకుంటున్నారు. అందువల్ల అనేక అబార్షన్స్ జరిగి ఆ మహిళ చనిపోయే పరిస్థితి ఎదురవుతున్నది. విదేశస్థులు కూడా సరోగసీ కొరకు మన రాష్ట్రానికి వస్తున్నారు. గల్ఫ్ కంట్రీల నుండి కూడా వస్తున్నారు. ఆఖరుకు ఈ పుట్టిన పిల్లల్ని అమ్మడం కూడా మొదలుపెట్టారు. కాబట్టి, ఈ చీకటి వ్యాపారాన్ని నిలువరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటున్నది, ఆరోగ్యకరమైన పల్లె ప్రాంతాలలో ఉన్న పేద మహిళల సమస్యకు సొల్యూషన్ ఏమిటి? ఈ దళారులను ఏ విధంగా అరికడతారో చెప్పవలసిందిగా తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ. 10.20

శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు (స్థానిక సంస్థలు – విజయనగరం): అధ్యక్షా, ఈ సరోగసి అనేది సుప్రీంకోర్టు కూడా అనెథికల్ ప్రాక్టీసుగా చెప్పడం జరిగింది. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం కూడా ఏదైనా చట్టం చేసే ఆలోచనలో ఉన్నదా, లేదా అనే విషయం గురించి చెప్పవలసిందిగా తమరి ద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, కేంద్రప్రభుత్వం విదేశీవ్యక్తులు మన దేశానికి వచ్చి సరోగసి ద్వారా సంతానం పొందే దానిపై నిషేధం విధించడం కోసం ఒక చట్టాన్ని చేసింది. అయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంతవరకూ బాగా డబ్బుండి పిల్లలను కనే కష్టం పడలేక లేకపోతే తమయొక్క సౌందర్యానికి భంగం కలుగుతుందని, పిల్లలు పుట్టే సౌకర్యం లేదని వారియొక్క శరీర నిర్మాణాన్ని గురించి ఆలోచించేవారు పేదవారిని టార్గెట్ చేస్తున్నారు. గౌరవసభ్యురాలు, శ్రీమతి శమంతకమణి గారు చెప్పిన విషయం దానిని ధృవీకరిస్తున్నది, అది మనందరికీ తెలిసిన విషయం. దీనిని నివారించడానికి సూత్రాలు, నియమ నిబంధనలు, స్ట్రిక్ట్ వెరిఫికేషన్ చేసే కేంద్రాల యొక్క ఫంక్షనింగ్‌పై వారి రోజువారీ కార్యకలాపాలు ఏమిటి, వారివద్దకు వస్తున్న రోగులెవరు, క్లెయిమ్ చేస్తున్నవారెవరు అనేదానిపై వివరణాత్మకమైన రిపోర్టును మన జిల్లా వైద్యాధికారుల ద్వారాగానీ లేదా ప్రత్యేకించినటువంటి అంశం ద్వారా గానీ, వెరిఫై చేసి వాటిని నియంత్రించడానికి సరైన విధివిధానాలను రూపొందించే ఆలోచన రాష్ట్రప్రభుత్వం చేస్తున్నదా, లేదా అనే విషయాలను తెలియజేయవలసిందిగా తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యా రావు: అధ్యక్షా, ఈ అంశంపై ఒక రాకెట్ ఉందని విశాఖపట్నంలో ఆమధ్య వార్తాపత్రికలలో వచ్చింది. దయచేసి మంత్రిగారు ఆ విషయాల గురించి వివరించవలసిందిగా నేను తమరిద్వారా వారిని కోరుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, గౌరవసభ్యురాలు శ్రీమతి శమంతకమణి గారు, గౌరవసభ్యులు శ్రీ ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, శ్రీ పి.జె.చంద్రశేఖర రావు, శ్రీ రాము సూర్యా రావు గార్లు అడిగిన విషయానికి వస్తే, ఏ.ఆర్.టి. సెంటర్లంటే అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజి సెంటర్లు. ఇవి మన రాష్ట్రంలో 40 సెంటర్లు ఉన్నాయి. వాటిలో IVF Centres, Infertility Centres, Test Tube Babies centres ఉన్నాయి. సరోగసి సెంటర్లు మాత్రం మన రాష్ట్రంలో ఎక్కడా ఇంతవరకూ నమోదుకాలేదు. ఈ ఏ.ఆర్.టి. సెంటర్లలో కూడా ఏది జరిగినా ప్రతినెల జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసరుకు రిపోర్టును పంపించాలి. మనం అప్రమత్తంగా ఉండి వాటిని నిరోధించడానికి కేంద్రప్రభుత్వం దీనిపై స్పష్టమైన గైడ్‌లైన్లను జారీ చేసింది. మగపిల్లలను ఇస్తామని గుంటూరులో సృష్టి అనే ఒక సెంటర్‌ను ఏర్పాటుచేస్తే, ప్రభుత్వం ఆ సెంటర్‌ను స్వాధీనపరచుకొని వారిపై కేసును నమోదుచేయడం జరిగింది. సుప్రీంకోర్టు commercial surrogacy with some guidelines అలవ్ చేసింది. There are so many guidelines. పార్లమెంటు కూడా ఒక బిల్లు ఇదివరకే ప్రవేశపెట్టింది. దానిలో ఉన్న కొన్ని ప్రొవిజన్లు ఏమిటంటే, లీగాలిటీ ఆఫ్ ద పేరెంట్స్ విషయంలో కమర్షియల్ పేరెంట్స్ మాత్రమే పేరెంట్స్ అవుతారు కానీ, బయోలాజికల్ పేరెంట్స్ మాత్రం పేరెంట్స్ అవరు. ఇప్పుడు కొన్ని అంతర్జాతీయ అంశాలు ఉన్నాయి. చాలాచోట్ల ఇండియాలో కొంచెం తక్కువ మొత్తానికి వారు చేస్తున్నారు. దాని గురించి కూడా కొంతమంది విదేశాలనుంచి ఇండియాకు వస్తున్నారు. Commercial exploitation of the human reproductive system మీద కూడా దీనిని తీసుకున్నారు. దీనిని ఎవరెవరు చేసుకోవచ్చంటే హిస్టెరెక్టమీ చేసుకున్నవారికి, పిల్లలు పుట్టని

వారికి, infertile అని డిక్లేర్ కాబడిన వారు కూడా చేసుకోవచ్చు. Sex selection surrogacy is not allowed. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆడబిడ్డ, మగబిడ్డ అని డిసైడ్ చేయడానికి వీలు లేదు. దాని ఉద్దేశ్యం ఏమిటంటే, infertility treatment including intrauterine insemination. ఎ) భర్త సెమెన్‌ను బట్టి డోనర్ సెమెన్‌ను బట్టి ఉంటుంది. b) creating embryos outside the human body c) processing/embryos outside the human body in clinics. దీనికి తప్పకుండా పార్లమెంటులో బిల్లును పెట్టి చేస్తారు. కొత్త బిల్లులో ఎలా పెట్టారంటే, సరోగసి తల్లి మెడికల్‌గా ఫిట్ అయి ఉండాలి. ఆమె గతంలో స్వంతంగా ఇద్దరు పిల్లలను కలిగి ఉండాలి. ఆమె 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగి వుండాలి. హ్యూమన్ యాంగిల్, పిల్లలు లేని వారు మొదలైనవన్నీ చూసి దీనిని వ్యాపారంగా మార్చకుండా ఉండాలనే దానిపై definitely, they have to notify to the local Governments. ఆ విధంగా లేకపోతే వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎక్కడైనా మీ దృష్టికి ఇటువంటి కేసులు వచ్చినట్లయితే వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చినట్లయితే తప్పకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు: (మైకు లేకుండా) అధ్యక్షా, ఇది వ్యాపారం కాకుండా ఏముంటుంది? ఈ విషయంలో పార్లమెంటు చట్టంలో వ్యాపారం కాకుండా నిషేధించేదానికి ఏ ప్రొవిజన్ లేదు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని వారి నాయకత్వంలో అది వ్యాపారం కాకుండా ఉండడం కోసం మరిన్ని కఠినమైన నిబంధనలు పెట్టవలసిన ఆవశ్యకత ఉన్నదని నేను తమరిద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

డా. కామినేని శ్రీనివాస్: అధ్యక్షా, సభ్యులు శ్రీ చంద్రశేఖర రావు గారు చెప్పినట్లు కేంద్రం నుంచి బిల్లు ఇంకా రావలసివుంది. ఆ బిల్లు చట్టంగా మారిన తర్వాత దానిలో లేనివి ఏవైనా ఉండి, మన రాష్ట్రప్రభుత్వం పెట్టుకోవాలనుకుంటే, మనం చర్చించవచ్చు. పిల్లలు లేని వారికి పిల్లలు కావాలి. కానీ, వారికి న్యాయంగా కావాలి. అందువల్లనే హ్యూమన్ యాంగిల్‌లో ఎటువంటి unethical incidents జరగకుండా కావలసిన చర్యలన్నీ ఈ సభ ద్వారానే చేద్దామని నేను తమరిద్వారా తెలియజేస్తున్నాను.

## క్యాట్‌ఫిష్ పెంపకంపై నిషేధం

ప్రశ్న నెం. 9455 (95)

శ్రీ పప్పల చలపతిరావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పాడిపరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) మన రాష్ట్రంలో జెల్ల పెంపకంపై ఏదేని నిషేధం వుందా?
ఆ) అయితే, దానికి కారణాలు ఏమిటి?

గౌరవనీయులైన పాడిపరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రివర్యులు (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు) :

అ) అవునండీ.
ఆ) I. ఆఫ్రికన్ జెల్ల విదేశీ జాతికి చెందినది. ఇది అధిక మాంసాహారి, నిరంతరం వేటాడే జీవి.
II. దీని మాంసాహార అలవాటు మన దేశీయ మత్స్య సంపదను మరియు మన జంతుజాల జీవ వైవిధ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

శ్రీ పప్పల చలపతిరావు ( స్థానిక సంస్థలు – విశాఖపట్నం): అధ్యక్షా, వారు చెప్పిన సమాధానం కాగితాలకే పరిమితమైంది కానీ, అమలు జరగలేదు. విశాఖ జిల్లాలో ఎక్కువగా ఈ చేపల్ని వారు పెంచుతున్నారు. ఈ మధ్య కాలంలో హుదుద్ తుఫాను సంభవించినప్పుడు అక్కడున్న చెరువులన్నింటికీ గండ్లు పడ్డాయి. అప్పుడు మామూలు చెరువులలోకి కూడా వెళ్లిపోయి దేశీయ మత్స్యసంపదను ఆ చేపలు విచ్ఛిన్నం చేస్తున్నాయి. దానికోసం ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకోవడం జరిగిందా అనే విషయం గురించి తెలియజేయవలసిందిగా నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ చలపతిరావు అడిగిన విషయంపై భారత ప్రభుత్వం ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ చేపల దిగుమతిపై నిషేధాన్ని విధించడం జరిగింది. దీనికి గల ముఖ్య కారణం, ఈ ఆఫ్రికన్ క్యాట్ ఫిష్ చేప అత్యంత మాంసాహార చేప మరియు స్వదేశీ చేపల మనుగడకు చాలా ముప్పు వాటిల్లుతుంది కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో కొల్లేరు ప్రాంతం వారు విదేశీ చేప అయిన క్యాట్ ఫిష్‌ను వెస్ట్‌బెంగాల్ లోని విత్తన అమ్మకందారుల సహాయంతో విచక్షణా రహితంగా భారతప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా దిగుమతి చేసుకోవడం జరిగింది. దీనివల్ల స్వదేశీ చేపల మనుగడకు ముప్పు ఏర్పడడం జరిగింది. తదనుగుణంగా, మత్స్యశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తేది. 31.05.1999 నాడు రాష్ట్రంలోని ప్రతి జిల్లా మత్స్యశాఖకు కూడా జిల్లాలో ఆక్వా రైతులకు ఈ క్యాట్ ఫిష్ చేపలపై ఒక అవగాహనను కల్పించడానికి ఒక కరపత్రాన్ని కూడా విడుదల చేయడం జరిగింది. ఆ విధంగా, ఈ మాంసాహార చేప అయిన ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్ చేప వల్ల స్వదేశీ చేపల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది కాబట్టి ఏరకమైన పద్ధతులలో కూడా దీనిని పెంచవద్దని ఒక నిర్ధారణ చేసి, ఒక కరపత్రాన్ని కూడా ప్రచురించి ఎవరైతే ఆక్వా రైతులున్నారో వారందరికీ ప్రభుత్వం బాగా అవగాహనను కల్పించడం జరిగింది.

అధ్యక్షా, ఏఏ జిల్లాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకుందనే విషయాన్ని కూడా సభ దృష్టికి తీసుకువస్తాను. విజయనగరం జిల్లాలో విజయనగరం మునిసిపాలిటీకి చెందిన చేపల మార్కెట్‌లో ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌ను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పంచనామా చేసి అక్కడే గుంట తీసి పూడ్చిపెట్టడం కూడా జరిగింది. అదేవిధంగా, వెదురువాడ గ్రామం బొందుపల్లి మండలంలో నిషేధించబడిన చేపలను గుర్తించి అక్కడ చెరువులను ధ్వంసం చేసి చేపలను చంపడం జరిగింది.

ఉ. 10.30

అధ్యక్షా, తేది. 11.09.2009 గజపతినగరం మండలంలోని, దోలపాలి, పిడిశం గ్రామాల్లో ఈ చేపల పెంపకాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని వాటిని చంపెయ్యడం కూడా జరిగింది. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండలాలలో కూడా మత్స్యశాఖ మరియు పోలీసు అధికారులు పూర్తిస్థాయి నిఘా పెట్టడం వల్ల క్యాట్‌ఫిష్ పెంపకం జరుగుతోందనే సమాచారం లభ్యంకాలేదు. కృష్ణా జిల్లాలోని మండవల్లి గ్రామం మరియు ఇంగ్లిపాక వంటి లంక గ్రామాలు, కొల్లేటి గ్రామంలో ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్ రవాణా చేస్తున్న వాహనాలను పోలీసు, అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుని రెవెన్యూ మరియు మత్స్యశాఖ అధికారుల సమక్షంలో పూడ్చి పెట్టడం జరిగింది.

అదేవిధంగా గుంటూరులో కూడా 2017 జనవరిలో పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఆఫ్రికన్ కేటగిరీ ఫిష్ పెంపకం చేస్తున్నారని గుర్తించి, పోలీసుల సహకారంతో మత్స్యశాఖ అధికారులు ఆయొక్క చేపలను పట్టి చంపి పూడ్చిపెట్టడం జరిగింది. ఆ రైతులను కూడా హెచ్చరించడం జరిగింది. నెల్లూరులో తేది.06.04.2016న బుచ్చిరెడ్డి గ్రామం పరిధిలో అమ్ముతున్న ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్‌ను కూడా స్వాధీనం చేసుకుని పూడ్చిపెట్టడమేగాక, చేపలను అమ్ముతున్నవారిమీద కేసులను పెట్టడం జరిగింది.

తేది.04.09.2015లో చిత్తూరులో నల్లదిమ్మెన్న చెరువులో రహస్యంగా పెంచుతున్న క్యాట్‌ఫిష్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయడం జరిగింది. అదేవిధంగా సాగుచేపట్టకుండా పోలీసు, రెవెన్యూ, మత్స్య, మార్కెటింగ్ అధికారులు అన్నిరకాలా చర్యలు తీసుకుంటున్నారు. అటవీ చెక్‌పోస్టులవద్ద నిఘా ఏర్పాటుచేసి చేపపిల్లలను, పెంచిన చేపలను రవాణాచేస్తున్న వాహనాలను స్వాధీనపరచుకొని వాటిమీద కూడా కేసులు పెట్టడం జరిగిందని మీద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## రబీలో సాగుభూమి

ప్రశ్న నెం. 9571 (96)

శ్రీ పి. జె. చంద్రశేఖరరావు,ఎం. ఎల్.సి.,

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

- అ) రాష్ట్రంలో రబీ కాలంలో సేద్యం చేయదగిన భూమి విస్తీర్ణం తగ్గిపోయిందన్న విషయం వాస్తమేనా?
- ఆ) అయితే, అందుకు గల కారణాలు ఏమిటి? అందుకు తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన వ్యవసాయ శాఖ, అగ్రి-ప్రాసెసింగ్, మార్కెటింగ్, గిడ్డంగులు, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖమంత్రి (శ్రీ ప్రత్తి పాటి పుల్లారావు)

- అ) అవునండీ.
- ఆ) వివరాలను అనుబంధంగా సభా సమక్షంలో ఉంచడమయింది.

**ప్రశ్ననెం. 9571 లోని (బి) ఖండానికి సమాధానం**

**రబీ కాలంలో సేద్యార్హమైన భూమి విస్తీర్ణం తగ్గిపోవడానికి గల కారణాలు :**

- ఈశాన్య ఋతుపవనాల కాలంలో, 296 మి.మీ.ల సాధారణ వర్షపాతానికిగాను 01-10-2016 నుండి 31-12-2016 వరకు కురిసిన వాస్తవ వర్షపాతం 85.3 మి.మీ.లుగా నమోదు అయింది. (లోటు అంటే-71 శాతం)

- 2016-17 రబీ కాలంలో, 24.63 లక్షల హెక్టార్ల సాధారణ విస్తీర్ణానికి గాను రాష్ట్రంలో విత్తిన మొత్తం విస్తీర్ణం 19. 93 లక్షల హెక్టార్లుగా ఉంది (81 శాతం)
- మొక్కజొన్న, జొన్న, శనగలు, పెసలు, మినుములు వంటి ప్రధాన పంటల క్రింద ఉన్న రబీ నాట్లు ఈశాన్య ఋతుపవనాల వైఫల్యం వల్ల, తగిన భూసార తేమ లేనందున రబీ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలోని వర్షాధార చెరువుల క్రింద మరియు ఎన్ఎస్‌పి క్రింద కూడా రబీ కాలంలో ధాన్యం నాట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**ప్రభుత్వం తీసుకున్న చర్యలు :**

- సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల కోసం విత్తనాన్ని సమకూర్చడం ద్వారా ఐడి పంటలను ప్రోత్సహించడం
- నెల్లూరు, కర్నూలు, ప్రకాశం, అనంతపురము, కృష్ణా, గుంటూరు జిల్లాలలోని రైతులకు రూ.1483.00 లక్షల విలువ గల 34705 క్వింటాళ్ల పరిమాణంతో వివిధ ప్రత్యామ్నాయ పంట విత్తనాలను (పప్పుధాన్యాలు, వేరుశనగ, కొర్ర, నువ్వులు, శనగలు) పంపిణీ చేయడమయింది.
- సబ్సిడీపై రైతులకు విత్తనాలను సరఫరా చేయడం ద్వారా గోదావరి జిల్లాలు మరియు శ్రీకాకుళం, విజయనగరం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో వేసవిలో పండించే పప్పుధాన్యాలకు అదనంగా 2.00 లక్షల విస్తీర్ణం మేరకు రబీని వర్తింపచేస్తూ లోటు ప్రాంతాలకు సహాయం అందించడం కోసం ఇప్పటికే చర్యను ప్రారంభించడమయింది. 33.35 శాతం సబ్సిడీపై 3,300 క్వింటాళ్ల మినప, 2,479 క్వింటాళ్ల పెసర విత్తనాలను సరఫరా చేయడమయింది.
- **నీటి బడ్జెటు :** ఎస్ఎస్పి మరియు డెల్టా ప్రాంతాలలో నీటి బడ్జెట్‌ను అనుసరిస్తూ న్యాయబద్ధమైన వినియోగం కోసం సాగునీటి శాఖ సమన్వయంతో నీటి విడుదలను క్రమబద్ధీకరించడమయింది.
- **ఆయిల్ ఇంజన్లు :** వరుసగా రూ. 565.20 లక్షలు, రూ. 562.35 లక్షల మొత్తం సబ్సిడీతో 5652 ఆయిల్ ఇంజన్లు, 3058 యూనిట్ల (ఒక్కో యూనిట్ 600 మీటర్లు) నీటి సరఫరా పైపుల ద్వారా వనరులన్నింటిలో లభ్యంగా ఉన్న నీటిని న్యాయబద్ధంగా వినియోగించుకోవడం కోసం సరఫరా చేయడమయింది.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, ఇది చాలా విధానపరమైనటువంటిది. ప్రజలయొక్క ఆహారభద్రతకు, రైతులయొక్క జీవనశైలికి సంబంధించినటువంటి అంశం. అంతేగాక మన రాష్ట్ర ప్రజల సంస్కృతికి సంబంధించినటువంటి అంశమని మనవి చేస్తున్నాను. ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం ఉండి రబీకి వచ్చేటప్పటికి తగ్గిపోయింది. మొత్తం సమస్యలో ఇదొక చిన్న భాగం. నేను మనవి చేస్తున్నదేమంటే ఈ విస్తీర్ణం తగ్గుదల అనేటటువంటిది కేవలం వర్షాభావం వల్లనే జరుగుతున్నదనేది పరిపూర్ణమైన సత్యంకాదు. అది పాక్షికమైనటువంటి సత్యం మాత్రమేనని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా స్వామినాథన్ కమిషన్ ఇచ్చిన నివేదికను మేము ఒప్పుకుంటున్నామనీ, అది మాకు బైబిల్ వంటిదనీ చెప్పి అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వమైతే సుప్రీంకోర్టుముందు స్వామినాథన్ కమిషన్‌కు మాకు సంబంధంలేదనీ, మేము దానిని ఫాలో కాలేమని అఫిడవిట్ కూడా ఫైల్ చేసింది.

మిస్టర్ ఛైర్మన్: ప్రశ్న వేయండి.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, ప్రశ్నకే పరిమితమైపోతే ఆయన చెప్పిన సమాధానంతోనే సరిపోతుంది. ప్రశ్న వెనక ఉన్నటువంటి స్పిరిట్‌ను, ప్రాధాన్యతని తెలిజేయడానికి దయచేసి తమరు నాకు మాట్లాడడానికి కొంచెంసేపు అవకాశం ఇవ్వమని కోరుతున్నాను.

సేద్యానికి అనువైనటువంటి భూమి సేద్యంనుంచి రోజు రోజుకు ఎందుకు కుదించుకుపోతున్నదనే అంశంమీద గత 20, 30 సంవత్సరాలలో మన రాష్ట్రంలో ఎంత భూమి సేద్యానికి వచ్చిందో పరిశీలిస్తే మన రాష్ట్రంలోని పారిశ్రామికాభివృద్ధికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాలలోని జనపనార మిల్లులే ఒక ప్రధానమైన కారణం. అయితే జనపనారను తీసేసినందున రైతుల జీవనాధారం పోయింది. ఆ

మిల్లులూ మూతపడిపోయాయి. ఆ ప్రభావం కేవలం రైతులకూ, వ్యవసాయానికే పరిమితంకాకుండా మొత్తం సమాజంలో ఉండే ప్రతీ వర్గంమీద పడింది.

నాదగ్గరున్నటువంటి సమాచారం మేరకు గత ఇరవై సంవత్సరాలలో ఆ మూడుజిల్లాల్లో, కోస్తాలోని దాదాపుగా ముప్పై శాతం సేద్యం జరుగుతున్నభూమి అంతాకూడా నీటిపారుదల సౌకర్యమున్నా, వర్షాభావం లేకపోయినా కమర్షియల్ భూమిగా మారిపోయింది. అదంతా కూడా ఇంజనీరింగ్ కళాశాలలు, రహదార్లు, థర్మల్ పవర్ ప్లాంట్లు ఇలా అన్నింటిమీద కన్‌వర్ట్ అయిపోయింది. వ్యవసాయ శాఖమంత్రి పుల్లారావుగారు ఇక్కడ పరిష్కారం చేయగలిగి సమాధానం చెప్పగలిగే సమస్య ఇదని నేను అనుకోవడంలేదు. మొత్తం ప్రభుత్వంలోని మేధావులతో, వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై చర్చించి దీనికేదైనా పరిష్కారం చూపిస్తారని ఆశిస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, ఇది ఒక ప్రధానమైన అంశం. అలాగే ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. రాష్ట్రం విడిపోయిన తరువాత గతంలో కంటే కూడా మన 13 జిల్లాల్లో రబీసాగు గణనీయంగా పడిపోతోంది. దీనికిగల కారణాలు విశ్లేషించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మంత్రిగారు ఇచ్చినటువంటి సమాధానంలో 2016-17 రబీకాలంలో 24.63 లక్షల హెక్టార్లు సాధారణ విస్తీర్ణమని చెప్పారు. అయితే 2014-15 సంవత్సరంలో రాష్ట్రం విడిపోయిననాటికి సాధారణ సాగు 27.26లక్షల హెక్టార్లు, 2015-16లో 23.19 లక్షల హెక్టార్లుగా ఉండేది. 2016-17 సంవత్సరానికి సాధారణ సాగు విస్తీర్ణంలో విత్తన విస్తీర్ణం 19.93 లక్షల హెక్టార్లన్నారు. నా వద్ద ఉన్న సమాచారం మేరకు విత్తిన విస్తీర్ణం 19.47లక్షల హెక్టార్లు. కొద్దిగా అటూ, ఇటూ అయినా కూడా ఈ మూడు సంవత్సరాల నుంచి నిరంతరాయంగా తగ్గుతూనే ఉంది. ప్రతీ సంవత్సరం రెండు, మూడు లక్షల ఎకరాలు తగ్గిపోతూనే ఉంది. ఐడి క్రాప్స్(Irrigated Dry Crops)ను మీరు ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సబ్సిడీలో ఇస్తున్నామన్నారు. ఏ ఏ ప్రత్యామ్నాయ పంటలనేది మీరు వివరణ ఇవ్వాల్సిన అవసరముంది. ఈ ప్రత్యామ్నాయ పంటల విత్తనాలకు సంబంధించి గతంలో చేసిన ప్రయోగాలుకూడా ఉన్నాయి. మనకి ముఖ్యంగా మొదటి పంటగా వరి వేస్తారు. డెల్టాప్రాంతంలో వరి పంటకు ఇప్పుడు పెడ్తున్న నీళ్ళు అవసరంలేదు.

ఉ. 10.40

వాటర్ సేవింగ్ డివైసెస్ కొన్ని ఉన్నాయి, అవి చర్చకు కూడా వచ్చాయి. అయితే వాటిని ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చినప్పుడల్లా వారు వాటిని సక్రమంగా ఉపయోగించడం లేదు. అందువల్ల మొదటి పంట వరికి పెట్టే నీళ్లు అంత అవసరం లేదు కాబట్టి, వాటర్ సేవింగ్ డివైసెస్‌ని మీరు రివైజ్ చేయగలిగితే, వాటర్ సేవింగ్ గురించి రైతులకు చెప్పగలిగితే మొదటి పంటకు నీళ్లు సేవ్ అవుతాయి, మిగిలిన నీళ్లని రెండవ పంటకు వినియోగించుకోవడానికి వీలౌతుంది. రెండవ పంటలో నీరు ఎక్కువగా అవసరం లేని పంటలను తీసుకుని రాగలిగితే మనకు రెండు పంటలు కలిపి ఎక్కువ ఉపయోగం ఉంటుంది. లేకుంటే టోటల్‌గా ప్రాజెక్టుల ద్వారా కృష్ణా, గోదావరి నీళ్లు వచ్చేంతవరకూ ఇబ్బంది అవుతుంది.

రెండవ అంశం ఏమంటే, వ్యవసాయ భూములు వ్యవసాయం కోసం కాకుండా వ్యవసాయేతర అవసరాలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ భూముల్ని, వ్యవసాయం కోసమే వాడాలిగానీ, వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించకూడదని నిబంధనలు పెట్టింది. అయినా అవి అమలు జరగడం లేదు. మూడు పంటలు పండే భూములు కూడా అలా వృథా అవుతున్నాయి. ఇంతకముందు మన గౌరవ సభ్యులు చెప్పినట్లు, కమర్షియల్ పర్పస్‌కు మాత్రమే కాకుండా బ్రిక్ పరిశ్రమలకు కూడా చాలా సారవంతమైన నేలలు వాడుతున్నారు. అందువల్ల, బ్రిక్ ఇండస్ట్రీలకు

సంబంధించి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు ఒక నిబంధనను రూపొందించారు. అది అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అందింది. దాని సారాంశం, traditional brick industries స్థానంలో, ఫాల్టీ బ్రిక్స్, సిమెంట్ బ్రిక్స్‌ను ప్రాపగేట్ చేయమని కేంద్రప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు డైరెక్షన్ ఇచ్చింది. కానీ ఆ పద్ధతులను మనం ఎక్కడైనా ఉపయోగిస్తున్నామా? ఎక్కడైనా వాటి గురించి ఆలోచిస్తున్నామా? రైతులకు వాటి గురించి ఎడ్యుకేట్ చేస్తున్నామా? నాన్ ఎగ్రికల్చర్ పర్పస్‌కు డైవర్ట్ చేసేది చూస్తే, అసలే ఇప్పుడు కొన్ని, కొన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు తప్పనిసరి. రెయిన్‌గన్స్‌తోనో, రోడ్లు వేసే చోటో అగ్రికల్చర్ ల్యాండ్స్, నాన్ ఎగ్రికల్చర్ యూజ్‌కు పోతున్నాయి. కానీ, అవసరం లేని చోట కూడా వ్యవసాయ భూములు వృథా అవుతున్నాయి. పంట పండించే ఏరియా తగ్గిపోయింది అంటే భవిష్యత్తులో ఆహారపదార్థాలకు చాలా కొరత ఏర్పడుతుంది. అది నివారించేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా అని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సోము వీర్రాజు (శాసనసభా నియోజకవర్గం): ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలు రెండుగా విడిపోయిన తరువాత ఈ సంవత్సరం వచ్చిన అంశం తెలంగాణలో పంట ఉత్పత్తి పెరిగింది, ఆంధ్రప్రాంతంలో ఉత్పత్తి తగ్గింది. అలాగే, తెలంగాణా ఏర్పడిన తరువాత ఆంధ్రరాష్ట్రంలో నీటిని వినియోగించే అంశంలో అనేక రకాలైన ప్రయోగాలు. కలిసున్న తెలంగాణ రాష్ట్రంలో ఇరిగేషన్‌కు సంబంధించిన మంత్రులందరూ వాళ్లే ఉండడం మూలంగా అనేక రకాల నీటి వనరులను వాళ్ల రాష్ట్రానికి వినియోగించి, వాళ్ల పంటల ఉత్పత్తిని పెంచే సందర్భం ఉందా, లేదా? విడిపోయిన తరువాత మనకు అనేక విధాల మన పంటను పెంచే ఇరిగేటెడ్ ఆలోచన ఏమైనా ఉందా? విడిపోయిన మూలంగానే చాలామంది విడిపోయి నష్టపోయామని అంటున్నారు. కలిసి ఉన్నప్పుడు జడిసిపోయి, ముఖ్యమంత్రులు తెలంగాణా వాళ్లనే ఇరిగేషన్ మంత్రులుగా పెట్టేవాళ్లు. వాళ్ల పంట ఇప్పుడు ఎక్కువగా పెరిగింది. విడిపోయిన తరువాత మన రాష్ట్రం గురించి, మన జిల్లాల గురించి, మన ప్రభుత్వం గురించి మనం ఆలోచించే స్వభావం ఈ 13 జిల్లాల విషయంలో వచ్చిందా, లేదా? దీన్ని పెద్దలందరూ అధ్యయనం చేయాలని తమ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు, శ్రీ పి.జె.చంద్రశేఖరరావు గారు, శ్రీ సోము వీర్రాజుగారు అడిగినట్లు రబీలో పంట పండించే ఏరియా తగ్గిన మాట వాస్తవమే. వర్షాభావ పరిస్థితులు, ప్రాజెక్టులలో నీళ్లు లేకపోవడం వలన, నెల్లూరు, చిత్తూరు వంటి ప్రాంతాలలో చెరువులలో నీళ్లు తగ్గిపోవడం వలన పంట విస్తీర్ణం తగ్గిన మాట వాస్తవం. దానిలో గౌరవ సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకట్వేర్లు గారు అడిగినదానికి, నార్మల్ ఏరియా విడిపోయిన తరువాత 24లక్షల 62వేల హెక్టార్లు ఉంది. 2014-15వ సంవత్సరంలో 23లక్షల 19వేల హెక్టార్లలో రబీ పంట వేయడం జరిగింది. 2015-16వ సంవత్సరంలో 23లక్షల 39వేల హెక్టార్లలో రబీ పంట వేయడం జరిగింది. గత మూడు సంవత్సరాలతో పోల్చి చూస్తే, 2016-17వ సంవత్సరంలోనే బాగా తగ్గింది. వర్షపాతం కూడా 71శాతం ఉంది. అధ్యక్షా, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. నాగార్జునసాగర్‌లో నీళ్లు లేకపోవడం, ఆ ఏరియాలో రబీ లేకపోవడం, అదేవిధంగా తగ్గుతున్న మాట వాస్తవం. సేద్యం చేస్తున్న భూమి పరిమాణం తగ్గినా కూడా నూతన వంగడాలను ప్రవేశపెట్టి ఉత్పాదకత పెంచడం ద్వారా కూడా ఆహార ధాన్యాల దిగుబడి ఈ సంవత్సరం బాగా పెంచగలిగాము. గత సంవత్సరం కంటే కూడా 9శాతం ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది. 1లక్షా 56వేల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది. ఆ విధంగా పంట విస్తీర్ణం తగ్గినప్పటికీ, కొత్త వంగడాలు వలన, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం అవలంబిస్తున్న న్యూ టెక్నాలజీ వలన ఈ సంవత్సరం బాగా దిగుబడులు పెరిగాయి. ఖరీఫ్ పండించే ఏరియా తగ్గినప్పటికీ ఆహార ధాన్యాల ఉత్పత్తి 9శాతం అదనంగా సాధించగలిగాము.

అదేవిధంగా ఈ రోజున గౌరవ సభ్యులు శ్రీ సోము వీర్రాజు గారు తెలంగాణకు ఎక్కువ వాటర్ ఉంది, ఆంధ్రప్రదేశ్‌లో ఏరియా పెంచాలని అడిగారు. శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఎకరానికి నీరు అందించే కార్యక్రమం చేస్తున్నాము. ముఖ్యంగా ఎక్కడ లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నా వాటిని అన్నింటినీ పునరుద్ధరించాము. ఏ ఒక్క లిఫ్ట్ కూడా నిరుపయోగంగా ఉండడానికి వీల్లేదు. ప్రతీ లిఫ్ట్ క్రింద డ్రిప్, స్ప్రింక్లర్లు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎందుకంటే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించాలి. ఆ టెక్నాలజీని గురించి కూడా ఉభయగోదావరి జిల్లాల్లాంటి ప్రాంతాలలోని రైతులకు కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. తక్కువ నీటితో వరి పండించడానికి కూడా రైతుల్లో అవేర్‌నెస్ తీసుకువస్తున్నాము. కాబట్టి, ఈ రోజు జలసిరి క్రింద బోర్లు ఇస్తున్నాము. మూడు నుండి ఎనిమిది మీటర్లలో నీరు ఉండేలా, ప్రతీ నీటి బొట్టుని భూగర్భ జలాలుగా పెంచే ప్రయత్నం చేస్తున్నాము. ప్రతీ ఎకరానికి నీటిని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాము. సోము వీర్రాజు గారు చెప్పినట్లు ఈనాడు ఇరిగేషన్‌కు టాప్ ప్రయారిటీ ఇవ్వడం జరిగింది. దానిలో భాగమే ఈ పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టులు. ఆవిధంగా రాష్ట్రం మొత్తం 13 జిల్లాలలో కూడా ఎక్కడ డ్రై ల్యాండ్ ఉందో, ఆ డ్రై ల్యాండ్‌ను ఇరిగేటెడ్ ల్యాండ్‌గా కన్వర్ట్ చేయడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతి ఎకరానికి నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామని గౌరవ సభ్యులకు మీద్వారా తెలియజేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుః సార్, సార్...

MR. CHAIRMAN: No Sir, I am not allowing you. I have given enough time. ఇంకా చాలా ప్రశ్నలు ఉన్నాయి, డిస్కషన్ అయిపోతోంది.

## ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వేతనములు

ప్రశ్న నెం. 9417(97)

సర్వశ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి, ఎం.ఎల్.సిలు.

గౌరవనీయులైన ఆర్థికశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వేతనాల చెల్లింపుపై బడ్జెట్ నియంత్రణను తొలగించాలనే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

ఆ) అయితే అందుకు గల కారణాలు వివరించండి?

ఇ) వారికి 010 ఖాతా ద్వారా వేతనాల చెల్లింపును అమలు చేసేందుకు ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రివర్యులు (శ్రీ యనమల రామకృష్ణుడు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ) లేదండీ.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: అధ్యక్షా, ఏదైనా ఒక ప్రశ్న వేస్తే ఒక హామీనో, ఒక సానుకూలమైన ప్రతిపాదన ప్రభుత్వం నుండి వస్తుందని ఆశించి వేస్తాము. కొట్టినట్టుగా మేము వీళ్లను ఎంతకాలమైనా జీతాల కొరకు ఇబ్బంది పెడతాము, వీలైతే అందరూ ఉద్యోగాల నుండి వెళ్లిపోండి అనేవిధంగా ఈ సమాధానం ఉంది. ప్రతీ సంవత్సరం 12 నెలలు వీళ్లకు జీతాలు ఇస్తున్నాము, ఒకరోజు కూడా జీతాలు లేకుండా ఆపడం లేదు, ఎరియర్స్ ఒక్క రూపాయి కూడా పోకుండా ఇస్తున్నాము అంటున్నారు. ఆ

ఇచ్చేదేదో మిగతా ఉపాధ్యాయుల లాగానే ప్రతినెల 1వ తేదీనే ఇవ్వమని మా డిమాండ్. ఉపాధ్యాయుల సంఖ్యను కూడా చాలా రోజుల నుండి దాదాపు 25వేల మంది నుండి 8వేల మందికి తగ్గించేశారు.

ఉ.10.50

అధ్యక్షా, నిర్దాక్షిణ్యంగా ఈ ఎయిడెడ్ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకుండా వాటిని తగ్గించేశారు. సాక్షాత్తు ట్రెజరీ డిపార్టుమెంటు బడ్జెట్ కంట్రోల్ ఎత్తేయడం ద్వారా వీళ్లకు నెలనెలా జీతాలు ఇవ్వవచ్చన్న ప్రతిపాదన ఆర్థికశాఖకి పంపడం జరిగింది. ఆర్థికశాఖ దీనిని ఆధారంగా చేసుకుని వీళ్ల కేడర్ స్ట్రెంగ్త్ ఎంత ఉందని, జిల్లా విద్యాశాఖాధికారులను అడిగింది. ఆ జిల్లా విద్యాశాఖాధికారుల దగ్గర నుండి మూడు నెలలైనా ఎటువంటి వివరాలు రాలేదనే కారణంతో ఆ ఫైలు నడుస్తూనే ఉంది. ఆర్థికశాఖ వారు కొంత సానుకూలంగా స్పందిస్తున్నారనే ఉద్దేశంతో, ఆ సానుకూలతను పెంచుకోవచ్చని నేను ప్రశ్న వేస్తే, మీరు అలాంటి భ్రమలేమీ పెట్టుకోకండి అనే విధంగా ఈ జవాబు ఉంది. మేము దీనికి చాలా బాధపడుతున్నాము. ఈ జవాబుని మేము ఆ ఎయిడెడ్ విద్యాసంస్థల ఉపాధ్యాయుల దగ్గరకి తీసుకువెళ్లి, మీకు సంబంధించి ఈ విధంగా ప్రింట్ చేసిచ్చారు, మీరేమైనా నమ్మకం పెట్టుకుంటారేమో, ఆ భ్రమలు పెట్టుకోకండి అని మేము వాళ్లకి చెప్పే విధంగా ఉంది. మంత్రిగారూ... ఆర్థిక శాఖ కూడా దీనిని పరిశీలిస్తోంది, ట్రెజరీ డిపార్టుమెంటు వారు దీనికి అనుకూలంగా నోట్ పంపించారు. మీ శాఖ నుంచి కూడా క్రింది అధికారులను వివరాలు అడిగారు. దయుంచి దానిని దృష్టిలో పెట్టుకుని ఈ బడ్జెటు కంట్రోల్‌ని ఎత్తి వేసి, ఆ మిగిలిన ఎనిమిదివేల మంది ఉపాధ్యాయులకైనా నెలనెలా జీతాలు వచ్చేవిధంగా చూడండి. ఇదేమీ మీకు ఆర్థికభారం కాదు. ఒక ప్రొసీజర్‌కి సంబంధించిన విషయం మాత్రమే. దయుంచి మంత్రిగారు ఆ ఎయిడెడ్ ఉపాధ్యాయుల వైపు ఆలోచించి, ఆర్థికశాఖ నుంచి ఆ ఫైలుని వేగంగా కదిలించి, అనుకూలమైన నిర్ణయం తీసుకుని వాళ్లను కాపాడాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, ఈ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల విషయంలో ఇప్పటికీ వివక్షత కొనసాగుతోంది. ఒకటవ తారీఖునే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, సిబ్బందికి 010 పద్దు ద్వారా జీతాలు ఇచ్చారు. చాలా సంతోషం. మరి వీరికి కూడా ఇటువంటి సౌకర్యం కల్పించడానికి అభ్యంతరం ఏమిటని ఒక ప్రశ్నగా మిమ్మల్ని అడుగుతున్నాను. అంతేగాక ఎయిడెడ్ విద్యాసంస్థల్లో 2015వ సంవత్సరం తరువాత కొంతమంది ఉపాధ్యాయులు నియమితులు అయ్యారు. ఆ రిక్రూట్ అయిన ఉపాధ్యాయులకు ఉదాహరణ కావాలంటే నెల్లూరు జిల్లా ఆర్.కె.జె.సి అల్లూరు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఆరుగురు ఉపాధ్యాయులు అక్టోబరు, 2015వ సంవత్సరం తరువాత నియమితులు అయ్యారు. అప్రెంటిస్ విధానం ఈ రాష్ట్రంలో రద్దు అయ్యింది. అప్రెంటిస్ విధానంలేని జీతాలు వరుసగా రెండు డిఎస్సీల్లో 2015వ సంవత్సరానికి ముందు తీసుకున్నారు. ఆ అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేసి, రెగ్యులర్ వేతనాల కోసం ఆమరణ నిరాహార దీక్షలో కూర్చున్న వాళ్లలో నేను కూడా ఉన్నాను. ఆనాడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్షంలో ఉన్నారు. వారు కూడా వచ్చి దానికి మద్ధతు తెలిపారు. కానీ, 2015వ సంవత్సరం తరువాత నియామకమైన ఉపాధ్యాయులకి ఇప్పటికి కూడా ఆ అప్రెంటిస్ విధానం ద్వారానే రూ.3,600/-లు కానీ, రూ.4,500 కానీ జీతాలు ఇస్తున్నారు. వారి మీద ఈ వివక్షత ఎందుకు కొనసాగుతుంది, వారికి రెగ్యులర్ వేతనాలు ఎప్పుడిస్తారు? అని మీ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు: అధ్యక్షా, ఇప్పుడు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో విద్యార్థులు చేరడానికి సీట్లు దొరకక చాలా ఇబ్బందులు పడిన పరిస్థితి గతంలో ఉండేది. గత పది సంవత్సరాలలో ఈ ఎయిడెడ్ పోస్టులు నింపకపోవడం, తగ్గించడం వంటి కారణాల వల్ల ఇప్పుడు ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల నియామకాలు లేవు. అక్కడ విద్యార్థుల సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, సరిపడినంత మంది ఉపాధ్యాయులు లేరు. రకరకాల కోర్టు కేసుల తరువాత ముఖ్యమంత్రిగారు వారి నియామకాలకు ఈ మధ్యే క్లియరెన్స్ ఇవ్వడం జరిగింది. మరి వాటికి పూర్వ వైభవం రావాలంటే, అక్కడ ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి. ఒకటో తారీఖుకి జీతాలు రావడం లేదు. గ్రాంటు అయితే ఇస్తున్నాము కానీ, కొన్ని టెక్నికల్ కారణాల వల్ల డిలే అవ్వడం, ల్యాప్స్ అవ్వడం జరుగుతోంది. దీనివల్ల వారు రెండుమూడ్నెల్లకు ఒకసారి జీతాలు తీసుకోవడం జరుగుతోంది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి జీతాలు 15, 20 తారీఖులలో వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. దానికి ధన్యవాదాలు. కానీ, ఒకటవ తారీఖే జీతాలు వచ్చే విధంగా చేసి, వారికి పూర్తి న్యాయం చేకూర్చాలని మీ ద్వారా కోరుతున్నాను. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఎంతో ఖర్చు కూడా కాదు. వారికి నియామకాలు, పదోన్నతులు లేవు కాబట్టి వారికి జీతాలు కూడా సరిగా రాకపోతే పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాష్ట్రంలో ఉన్న సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులలో ఈ ఎనిమిదివేల మంది ఉపాధ్యాయుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. దయచేసి ఎంతోమంది పేదలకు ఒకటో తారీఖే పెన్షన్ ఇవ్వాలనే లక్ష్యంతో దాదాపు 80% సంతృప్తి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న ఈ సందర్భంలో, మా ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కూడా ఒకటే తారీఖే జీతాలిచ్చే విధానాన్ని పరిశీలించి న్యాయం చేయాల్సిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

డా.ఏ.ఎస్. రామకృష్ణ (ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, మేము ఇది చాలా ముఖ్యమైన విషయమని అనుకుంటున్నాము. ఎయిడెడ్ విద్యాసంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులకు ఒకటో తారీఖే జీతాలు రావాలని వారందరి యొక్క డిమాండుగా ఉంది. ఇది న్యాయసమ్మతమైన డిమాండు అని నేను అనుకుంటున్నాను. ఇది ఎంత తొందరగా తీరిస్తే ప్రభుత్వానికి అంత మంచిదని నేను భావిస్తున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, ఈ ప్రశ్నకు సంబంధించి మొదట మాట్లాడిన గౌరవసభ్యులు నాకంటే చాలా విపులంగా చెప్పారు. ప్రభుత్వం పరిశీలనలో ఉందని ఆయనే సమాధానం చెప్పారు, నేను చెప్పాల్సిన అవసరం కూడా లేదు. It is under consideration and examination. అది జరుగుతోందని వారికి తెలుసు. తెలిసికూడా ప్రశ్నలు వేశారు. ఈ రోజు ఇప్పటి వరకు జరిగిన అంశాల మీదే రిప్లై ఉంటుంది తప్ప, భవిష్యత్తులో జరిగేదానికి రిప్లై ఉండదు, it is under examination. As on today, మా పద్ధతి ప్రకారం ఎవరికీ కూడా జీతాలు ఆపకుండా సమయం ప్రకారం చెల్లిస్తున్నాము. ఇది ఏవిధంగా చేయాలనే దాని మీద వారు ఒక రిప్రజెంటేషన్ ఇచ్చారు, అవి ఎగ్జామినేషన్‌లో ఉన్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న తరువాత అది సభలో చెప్పడం జరుగుతుంది.

శ్రీ విటపు బాల సుబ్రమణ్యం: అధ్యక్షా, పరిశీలనలో ఉందని చెబితే సంతృప్తిగా ఉండేవాళ్లం కదా, అదేమీ లేకుండా మాకు ఆ ఆలోచనే లేదని మీరు చెప్పారు. ఇది ప్రభుత్వ పరిశీలనలో ఉందని మేమంటుంటే, మాకన్నా మీరే ఎక్కువ చెబుతున్నారు కాబట్టి అడగడం దేనికి అంటున్నారు. ఇంత డొంకతిరుగుడు దేనికి సార్? ఆలోచనలో ఉంది, మేము ఇది చేస్తాము అని చెప్పండి, చప్పట్లు కొట్టి కూర్చుంటాము.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, గౌరవ సభ్యులు సీనియర్ మెంబర్ కాబట్టి వారికి అన్ని విషయాలు తెలుసు, అవన్నీ వారు సప్లిమెంటరీలో అడిగితే వస్తాయి. ప్రభుత్వ పరిశీలనలో ఆ అంశం ఉందని వారికి తెలుసు, పరిశీలిస్తున్నది నిజమే, దాని మీద నిర్ణయం తీసుకున్న తరువాత ఆ విషయాన్ని జీ.ఓలు ఇచ్చి తెలియచేస్తాం, ఇప్పటివరకూ జీతాలు ఇవ్వడంలో ఎటువంటి ఆటంకాలు లేవు.

(అంతరాయం)

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి: అధ్యక్షా, నేను అడిగిన ప్రశ్నకు సమాధానం రాలేదు.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, సభ్యులు 010 పద్దు అడిగినా, ఏదడిగినా పరిశీలనలో ఉందని చెప్పాను. తరువాత జీతాల వరకు ఏవిధమైన అభ్యంతరం లేకుండా ఇస్తున్నాము. అదేవిధంగా దాదాపు ఎయిడెడ్ ఉపాధ్యాయలు గానీ, అధ్యాపకులకు గానీ, రూ.3,000 కోట్ల వరకు బడ్జెటు నుండి వెళుతుంది. అందుచేత మేము ఇన్‌ఫ్లో చూసుకోవాలి. బడ్జెటు కంట్రోల్ ఎలా అనేది చూసి, దానిలో నుంచి వీళ్ల జీతాలకు ఏవిధంగా అమౌంట్ తీయాలనేది చూసిన తరువాత గౌరవసభ్యులకు తెలియజేస్తాము.

## ఆంధ్రాయూనివర్సిటీలో నాన్ బోర్డర్స్

ప్రశ్న నెం.9445(99)

డా.ఎం.వి.వి.ఎస్. మూర్తి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఆంధ్రా విశ్వవిద్యాలయ హాస్టల్‌లో నాన్-బోర్డర్లు నివసిస్తున్నారన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, వారు నివసిస్తున్న సంవత్సరాల వివరాలు; అందుకు తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు (శ్రీ గంటా శ్రీనివాసరావు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి: అధ్యక్షా, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదంటే మేము అడిగేదేముంది. రికార్డు అంతా నా దగ్గర ఉంది. దీనిలో రెండు మాటలు మీకు చదివి వినిపిస్తాను. (వార్తా పత్రికలోని ప్రచురణను చదివారు) ఇది ఆగస్టు 21వ తారీఖుది. నాన్ బోర్డర్‌లపై ఎ.వి.వి.సి (ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్) సీరియస్. వివిధ హాస్టల్స్‌లో సంభవించిన నాన్ బోర్డర్‌ల వ్యవహారంపై ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సీరియస్‌గా ఉన్నారు. హాస్టల్‌లోనుంచి నాన్ బోర్డర్‌ల ఏరివేత దిశగా దృష్టిసారించారు. ఇంకా చదవమంటారా? ఇదంతా చదివితే, సమాధానం వారే చెప్పుకోవాలి. అదొకటి.

అసలు ఉన్నతవిద్య అనేది ఇప్పుడు చాలా బలహీన పడింది. ఈ మధ్య ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఆరుగురు ఇంజనీరింగు విద్యార్థులు గంజాయి వాడినందుకు సస్పెండ్ అయ్యారు. గర్ల్స్ హాస్టల్‌లోకి వెళ్లి అసభ్యకరమైన ప్రవర్తన. డా. జర్ల అప్పారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, మావోయిస్టులకు సహాయం.

ఉ. 11.00

All most on weekly-basis the students are striking for non-availability of quality food. ఇవన్నీ ఇలాగ, చదువుకుంటూ వెళుతుంటే, అసలు చదువుకునే విద్యార్థులకు, non-boardersలకు

హాస్టళ్ళల్లో చోటు లేకుండా పోతోంది. The electrical cookers should be removed. అందులో ఎలక్ట్రిక్ కుక్కర్లు, స్టవులు, గ్యాస్ పొయ్యిలు మొదలైన వాటి ద్వారా మిగిలిన వారు భోజనాలు వండుకుని తింటున్నారు. ఈ విధంగా జరుగుతుంటే, ఇక అసలైన విద్యార్థులకు న్యాయం ఎక్కడ జరుగుతుంది? ఇక అటువంటి వారికి క్వాలిటీ ఎడ్యుకేషన్ ఎక్కడ వస్తుంది? ఆంధ్రా యూనివర్శిటి అందరికీ ఆదర్శంగా ఉండవలసింది. దాదాపుగా వంద యేళ్ళ చరిత్రకు దగ్గరవుతోంది. మనకున్నటువంటి అన్ని విశ్వవిద్యాలయాలలో నెం.1 విశ్వవిద్యాలయం ఆంధ్రా విశ్వవిద్యాలయం అని చెప్పుకుంటున్నాము. అటువంటి కళాశాలకు సంబంధించి గౌరవ మంత్రిగారు ఈ విధంగా సమాధానం చెప్పడం ఏమిటి? ఇలా సభను తప్పుదారి పట్టించడం ఎందుకు? వాస్తవ విషయం ముందు చెప్పి ఉంటే బావుండేది కదా! ఈ కాగితాలను తమకు పాస్ ఆన్ చేస్తున్నాను.

(సంబంధిత ప్రతులను గౌరవ ఛైర్మన్‌గారికి అందించారు.)

శ్రీ గంటా శ్రీనివాసరావు: అధ్యక్షా, తప్పుదోవ పట్టించడం లేదు. ఆయనే సభను తప్పుదారి పట్టిస్తున్నారు. ఎందుకంటే, ఆయనే చదివారు. ఆంధ్ర యునివర్సిటి, నాన్‌బోర్డర్స్‌పై దృష్టి పెట్టారు, ప్రక్షాళన దిశగా ప్రయత్నాలు చేస్తారా అని అన్నారు. అవన్నీ కూడా వాస్తవమే. ప్రస్తుతం నాన్‌బోర్డర్స్ లేరని చెప్పాను తప్ప, ఎప్పుడూ లేరని చెప్పలేదు. ఒకప్పుడు కేవలం ఆంధ్రా యూనివర్శిటీనే కాదు, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో కూడా నాన్‌బోర్డర్స్ ఉన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత, అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆరోజున అజెండాలో దీనిని ఒక ప్రధాన అంశంగా పెట్టి, ఈ నాన్‌బోర్డర్స్ విషయాన్ని తీసుకోవడం జరిగింది. ఆ తరువాత, ఒక టైం ఫ్రేమ్ పెట్టి, ఆ సమయంలోగా పూర్తి చేయాలనుకున్నాము. ఎక్కడా కూడా విశ్వవిద్యాలయాలలో నాన్‌బోర్డర్స్ ఉండకూడదని చెప్పడం జరిగింది. ఆ తరువాత, కొన్ని విశ్వవిద్యాలయాలలో చేయలేదు కానీ, మరి కొన్ని విశ్వవిద్యాలయాలలో నాన్‌బోర్డర్స్‌ని తీసేటప్పుడు లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చాయని అన్నారు. మొత్తం మీద రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలలో కూడా దీనిని క్లియర్ చేయడం జరిగింది.

అలాగే, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో దాదాపు 10 మంది నాన్‌బోర్డర్స్ ఉన్నారని చెప్పినప్పుడు స్వయంగా నేను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌తో కూడా మాట్లాడి, ఈ హాస్టల్స్‌ను మిడ్‌నైట్ కూడా చెక్‌చేయవలసి వస్తుందని అన్నారు. ఐడి కార్డులు లేకుండా నాన్‌బోర్డర్స్ మీద యాక్షన్ తీసుకుంటామని చెప్పడం జరిగింది. ఇంకా కొంతమంది ఉంటే, వారిని కూడా తీసివేయడం జరిగింది. ప్రస్తుతం ఈ నాన్‌బోర్డర్స్ లేరని చెప్పడం జరిగింది. ఈ రోజు కూడా నేను చాలా స్పష్టంగా చెపుతున్నది ఏమిటంటే, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ నాన్‌బోర్డర్స్ ఎవరైనా ఉన్నట్లు చెపితే, వారిపైన వెంటనే యాక్షన్ తీసుకుంటామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. నేను వైస్‌ఛాన్స్‌లర్లతో కూడా చెప్పాను. వారితో కూడా మాట్లాడడం జరిగింది. అధ్యక్షా, ఆ విశ్వవిద్యాలయంలో ఇంకా చెక్‌చేస్తూనే ఉన్నాము. గౌరవ సభ్యులు మొన్న ఒక చిన్న సంఘటన జరిగిందని చెప్పారు. అప్పుడు నేను కూడా చాలా బాధపడ్డాను. నేను స్వయంగా ఆ విశ్వవిద్యాలయానికి వెళ్ళి ఎక్కడైతే గదిలో జరిగిందో, అక్కడకు వెళ్ళి, అక్కడున్న విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యి, అసలు ఎందుకు జరుగుతుందనే విషయాలను కూడా అడిగి తెలుసుకున్నాము. అక్కడున్న సిస్టమ్‌ను కూడా ఎగ్జామిన్ చేశాము. అక్కడ సిసి కెమేరాలను కూడా ఏర్పాటు చేశాము. 24 గంటలు సెక్యూరిటీ ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాము. ఎవరైతే గంజాయి తీసుకున్నారో, వాళ్ళే కాకుండా, ఆ సోర్సు ఎక్కడ నుంచి వచ్చిందనేది కూడా డిటెక్ట్ చేస్తున్నాము. పలు రకాలుగా విశ్వవిద్యాలయాలలో అన్ని చర్యలు తీసుకుంటున్నాము. గంజాయి మొదలైనవి కేవలం ఆంధ్రా యూనివర్శిటీలోనే కాదు, ఇప్పుడు అన్నిచోట్లా ఉంది. వీటిపైన ఈ ప్రభుత్వం చాలా సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నది. ఎట్టిపరిస్థితుల్లో వీటికి సంబంధించి తగిన చర్యలు తీసుకుంటాము.

## కళాశాలలకు నిధులు

ప్రశ్న నెం.9639 (100)

శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) ఆర్‌యుఎస్‌ఎ క్రింద కేంద్ర ప్రభుత్వం నుండి రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల, కాకినాడ పి.ఆర్.కళాశాల, కాకినాడ మహిళా కళాశాలలకు ప్రతీ కళాశాలకు రూ.2.00 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడమయిందా?

(ఆ) డిజిటలైజేషన్ నిమిత్తం ప్రతి కళాశాలకు రూ.50 లక్షల మొత్తాన్ని విడుదల చేయడమయిందా?

(ఇ) ఆ మొత్తాన్ని ఇప్పటివరకు వినియోగించని విషయం వాస్తవమేనా?

(ఈ) అయితే, ఎప్పటిలోగా ఆ మొత్తాన్ని ఖర్చు చేయడమవుతుంది?

(ఉ) సదరు మొత్తాన్ని ఎప్పటిలోగా విడుదల చేసి, కేటాయించిన పనులను ప్రారంభించడమవుతుంది?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు (శ్రీ గంటా శ్రీనివాసరావు):

(అ) అవునండీ. ఈ మూడు (3) కళాశాలల్లో ప్రతీ కళాశాలకు రూ.2.00 కోట్ల మొత్తాన్ని మంజూరు చేయడమయింది. అంతేగాక, ఈ మూడు (3) కళాశాలల్లో ప్రతీ కళాశాలకు రూ.50 లక్షల మొత్తాన్ని విడుదల చేయడమయింది.

(ఆ) అవునండీ.

(ఇ) మొత్తంలో కొంత భాగాన్ని వినియోగించడమయింది.

(ఈ) ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసుల శాఖ సేకరణ ఏజెన్సీని ఖరారు చేసే ప్రక్రియలో ఉంది. ఏజెన్సీ పరికరాలను డెలివరీ చేసినప్పుడు ఆ మొత్తాన్ని ఖర్చు చేయడమవుతుంది.

(ఉ) ఏజెన్సీని ఖరారు చేసినప్పుడు ఆ మొత్తాన్ని వినియోగించడమవుతుంది.

శ్రీ కలిదిండి రవికిరణ్ వర్మ (పట్టభద్రుల నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి): అధ్యక్షా, ఇది చాలా మంచి స్కీం. ఇందులో కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చింది APTS Agency ద్వారా గవర్నమెంటు డిగ్రీ కళాశాలలకు కంప్యూటర్స్, డిజిటలైజేషన్, సాఫ్ట్‌వేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ మొదలైన వాటి గురించి ఈ నిధులను కేటాయిస్తున్నామని అన్నారు. కానీ, వీటికి ప్రభుత్వం ఇచ్చిన నిధులు వాస్తవమే. కానీ, ఆ కళాశాలలకు ఎక్విప్‌మెంట్లు చేరలేదు. ఆల్‌మోస్ట్ ఆల్ ఈ కళాశాలలకు నిధులు మంజూరయ్యి, ఆరు నెలలు అయ్యింది. దాదాపు విద్యాసంవత్సరం కూడా ముగిసిపోతోంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వాటికి కూడా రాబోయే బడ్జెట్‌లో నిధులను మంజూరు చేయాలని కోరుతున్నాను. అలాగే, ఎక్విప్‌మెంట్లకు సంబంధించి మంజూరయిన నిధులకు ఆ మెటీరియల్ కళాశాలలకు త్వరగా వచ్చే విధంగా చేయాలని కోరుతున్నాను. ఎందుకంటే, గౌరవ మంత్రిగారు చెప్పినట్లుగా వాటికి డబ్బులు అందాయి. కానీ, ఆ ఎక్విప్‌మెంట్లు మాత్రం కళాశాలలకు

చేరలేదు. ఎందుకంటే, ప్రస్తుతం పరిక్షలు దగ్గరకు వస్తున్నాయి కాబట్టి, ఆ ఎక్విప్‌మెంట్లకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

డా. ఏ.ఎస్. రామకృష్ణ : అధ్యక్షా, ఈ RUSA నిధులకు సంబంధించి చూసినట్లయితే, ఇది చాలా ముఖ్యమైన కార్యక్రమం. Affiliating collegesని అభివృద్ధి చేయడానికి సంబంధించి ముఖ్యంగా మౌలిక సదుపాయాలను మరియు గ్రంథాలయాలను అభివృద్ధి చేయడానికి సంబంధించిన కార్యక్రమం ఇది. ఉదాహరణకు గుంటూరు మహిళా విశ్వవిద్యాలయానికి దాదాపు రూ.2 కోట్లు ఈ RUSA నిధుల క్రింద వచ్చాయి. కానీ, సంవత్సరం క్రితమే దాదాపు ఒక కోటీ, నలభై లక్షల రూపాయలకు సంబంధించి ఒక కాంట్రాక్టరుకు అప్పచెప్పారు. ఇంతవరకూ ఆ పనులే మొదలు కాలేదు. ఎప్పుడు మొదలవుతాయో తెలియదు. ఇక్కడ APTS నిధులకు సంబంధించి డేవిడ్ కుమార్ అనే అతను ఈ విషయంలో జోక్యం చేసుకుని, ఏదో కొంత అవినీతికి పాల్పడుతున్నాడనే సమాచారం సర్వేసర్వత్రా వినిపిస్తోంది. ఈ RUSA నిధులు దుర్వినియోగం కాకుండా చూడవలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ విటపు బాలసుబ్రహ్మణ్యం: అధ్యక్షా, అసలు ఈ రూసా నిధులు ఏ కళాశాలకు, ఎంతమేరకు ఇచ్చారు, అసలు ఎంత ఖర్చు అయింది, ఇంకా ఎంత ఖర్చు కావలసి ఉంది? వాటికి సంబంధించిన ఒక స్టేటస్ రిపోర్టు ఏమైనా ఇవ్వగలరా అని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు: అధ్యక్షా, ఈ రూసా నిధులను 7 కాంపొనెంట్లుగా చేయడం జరిగింది. వాటి క్రింద మొత్తం మంజూరయిన నిధులు దాదాపు రూ.357కోట్లు. అవి కూడా creation of University conversion Colleges in a cluster ఒకటి. దానికి రూ.55కోట్లు మంజూరయింది. అలాగే, 5 విశ్వవిద్యాలయాలకు మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.25కోట్లు మంజూరు చేశాము. అలాగే, ఒక 6 న్యూమోడల్ కళాశాలలకు ప్రతి కళాశాలకు రూ.12 కోట్ల చొప్పున దాదాపు రూ.70కోట్లు ఖర్చుచేయడం జరిగింది. అలాగే, up gradation of existing Degree Colleges as Modal Degree Colleges క్రింద 2 కళాశాలలకు రూ.4 కోట్లు చొప్పున కేటాయించడం జరిగింది. అలాగే, Infrastructure to the Colleges. ఇది రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 56 కళాశాలలకు సంబంధించి దాదాపు ప్రతి కళాశాలకు రూ.2 కోట్లు చొప్పున మొత్తం రూ.112 కోట్లు కేటాయించారు. అలాగే, preparatory grants for entire State దీనికిగాను రూ.10 కోట్లు కేటాయించడం జరిగింది. Management monitoring evolution and research దీనికి ఒక 0.4 కోట్లు. మొత్తం అన్నీ కలిపి రూ.357కోట్లు ఇందులో మంజూరయ్యాయి. ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రేషియో ప్రకారం మొత్తం చూసినట్లయితే, ఇందులో ప్రతి కాంపొనెంట్ క్రింద గౌరవ సభ్యులు చెప్పినట్లుగా అన్ని విషయాలు ఉన్నాయి. ఆ నివేదికను తమకు సబ్మిట్ చేస్తాను. తద్వారా గౌరవ సభ్యులు అందరికీ ఇవ్వవలసిందిగా రిక్వెస్టు చేస్తున్నాను. అయితే, ఇందులో రాష్ట్ర విభజన, కార్యాలయాలు షిఫ్ట్ కావడం వలన ఈ పనులన్నీ ఆలస్యం అయ్యాయి. నేను మొన్ననే ఈ అంశాలకు సంబంధించి ఒక రెవ్యూ కూడా చేశాను. త్వరలోనే మంజూరయిన నిధులకు సంబంధించి ఒక టైం ఫ్రేం పెట్టి, దాదాపు ఒక నెలలోపే ప్రారంభించేట్లుగా చర్యలు తీసుకుంటాము. అలాగే, 2017-18 చివరకల్లా అన్ని పనులు పూర్తి చేసే విధంగా ప్లాన్ చేస్తున్నాము.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్

ప్రశ్న నెం.9576 (91)

శ్రీ షరీఫ్ మొహ్మద్ అహ్మద్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారిత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

(అ) 2015-16, 2016-17 విద్యా సంవత్సరానికి మెట్రిక్ అనంతర స్కాలర్‌షిప్‌ల కోసం మైనారిటీ విద్యార్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తుల సంఖ్య ఎంత?

(ఆ) నిర్దేశించిన దరఖాస్తుల సంఖ్యకు మించి అధిక సంఖ్యలో అందిన దరఖాస్తులకు మెట్రిక్ అనంతర స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడానికి వీలుగా అదనపు నిధులను మంజూరు చేసే ప్రతిపాదన ఉందా?

(ఇ) అయితే, ఈ విద్యా సంవత్సరంలో స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడమయిందా?

గౌరవనీయులైన సమాచార, పౌర సంబంధాలు, మైనారిటీల సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రివర్యుల (శ్రీ పల్లె రఘునాథ రెడ్డి):

(అ) మైనారిటీలకు చెందిన విద్యార్థుల నుండి మెట్రిక్ అనంతర స్కాలర్‌షిప్‌ల పథకం క్రింద మంజూరు కోసం 2015-16 విద్యా సంవత్సరంలో 1,08,854 దరఖాస్తులు, 2016-17 విద్యా సంవత్సరంలో 1,16,356 దరఖాస్తులు అందాయి.

(ఆ) అర్హులైన విద్యార్థులందరికీ సంతృప్తత ప్రాతిపదికన మెట్రిక్ అనంతర స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడమయింది. అంతేగాక, ఆవశ్యకత ఆధారంగా ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఆర్‌టిఎఫ్) క్రింద ప్రభుత్వం 2015-16 విద్యా సంవత్సరంలో రూ.63.00 కోట్లను, 2016-17 విద్యా సంవత్సరంలో రూ.75.56 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది.

(ఇ) పైన పేర్కొన్నట్లుగా, మెట్రిక్ అనంతర స్కాలర్‌షిపుల మంజూరును సంతృప్తత ప్రాతిపదికపై చేయడమయింది. స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం కోసం అర్హులైన విద్యార్థులందరిని పరిగణనలోకి తీసుకోవడమయింది.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లో మైనారిటీలకు సంబంధించిన విద్యార్థుల నుండి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం 2015-16 విద్యాసంవత్సరంలో 1,08,854 దరఖాస్తులు వచ్చాయి. 2016-17 విద్యా సంవత్సరంలో దాదాపుగా 1,16,356 దరఖాస్తులు అందాయి.

అర్హులైన విద్యార్థులందరికీ శాట్యురేషన్ పాయింట్‌లో స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేగాకుండా, ఒక వేళ బడ్జెట్‌లో తక్కువ ఉంటే, ఇవి చాలకపోతే, అవసరాన్ని బట్టి కూడా అదనపు నిధులు ఇవ్వడం జరుగుతోంది. ఆ బేసిస్ మీద 2015-16 విద్యా సంవత్సరంలో ఆర్‌టిఎఫ్‌కు గాను, రూ.63కోట్లు, 2016-17 విద్యా సంవత్సరంలో అదనంగా రూ.75.56కోట్లు ఇచ్చి, అర్హులైన విద్యార్థులందరికీ కూడా ఈ శాట్యురేషన్ పాయింటులో స్కాలర్‌షిప్పులు ఇవ్వడం జరుగుతోంది.

ఈ విద్యా సంవత్సరానికి కూడా ఆర్‌టిఎఫ్‌లో దాదాపు రూ.225కోట్లు, ఎం.టి.ఎఫ్‌లో రూ.60 కోట్లు పెట్టాము. వెరసి రూ.285కోట్లు ఎవరైతే అర్హులైన విద్యార్థులు ఉన్నారో, వారికి కూడా సంతృప్తత ప్రాతిపదికపై స్కాలర్‌షిపులను మంజూరు చేయడమే కాకుండా, అవసరమైతే గత సంవత్సరం మాదిరిగా అదనపు బడ్జెట్‌ను ఇవ్వడానికి కూడా ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

శ్రీ షరీఫ్ మొహ్మద్ అహ్మద్ (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈ మైనారిటీ వర్గాల వారి విద్యా వికాసం కోసం ముఖ్యంగా ఉన్నత చదువులు చదువుకోవడానికి పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులు ఇస్తున్నారు. గౌరవ మంత్రిగారు చెప్పినట్లుగా గతంలో 23 జిల్లాల్లో మైనారిటీల సంక్షేమానికి ఖర్చుపెట్టిన దానికంటే, ఈ

ఎడ్యుకేషన్‌కు సంబంధించి ఫీజు–రీయింబర్స్ మెంటు మీద ఈ ప్రభుత్వం చాలా పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతోంది. దానికి నేను ఈ ప్రభుత్వాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఇక్కడ నేను గౌరవ మంత్రిగారిని ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్పుల పైన కూడా దృష్టి సారించాలని ఈ సందర్భంగా తమ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉ.11.10

అధ్యక్షా, గత రెండు సంవత్సరాలుగా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం మైనారిటీ విద్యార్థులు ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నారు? కేంద్ర ప్రభుత్వం నుండి ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఎంత మంది విద్యార్థులకు అందాయి? మిగిలిపోయిన విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి ప్రభుత్వ పరంగా తీసుకొన్న చర్యలు ఏమైనా ఉన్నాయా? రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుండి మిగిలిపోయిన విద్యార్థులకి ఏ రకంగా అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసిందో ఆ విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా మంజూరు చేస్తుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పరంగా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయడం జరిగింది. కాబట్టి మరల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను పునరుద్ధరించి సుమారుగా 63, 65 వేల మంది విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయలేదనే సమాచారం వచ్చింది. కాబట్టి మిగతా విద్యార్థులందరికీ ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసి, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను ఇవ్వడంలో ఏ విధంగా అయితే ప్రభుత్వం కృతకృత్యులైందో, అదేవిధంగా మైనారిటీలకు చెందిన విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసి, ప్రాథమిక స్థాయి నుండి చదువుకొనే విద్యార్థులని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం ఉండాలని మీద్వారా మంత్రి గారికి విన్నవిస్తున్నాను.

MR. CHAIRMAN: Today, we have got Short Discussion on this and you (Mr.Jani) can take-part on that.

డా.పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ గారు చెప్పినట్లు, ఈ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల కోసం, వారి స్కాలర్‌షిప్‌ల కోసం భారీ మొత్తంలో బడ్జెట్‌ను కేటాయిస్తున్నాము. గత సంవత్సరం 2016-17వ సంవత్సరంలో రూ.295.56కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి అదనంగా కేంద్ర ప్రభుత్వం కూడా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను అంటే 1వ తరగతి నుండి 5వ తరగతి వరకూ చదివే వారికి రూ.1,000, 6వ తరగతి నుండి 10వ తరగతి వరకూ చదివే వారికి రూ.5,000 వంతున ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను 2014-15వ సంవత్సరంలో 1,31,069 మందికి రూ.27.95కోట్లు మంజూరు చేయడం జరిగింది. 2015-16వ సంవత్సరంలో 1,56,732 మంది విద్యార్థులకు గాను రూ.36,37,75,000 మంజూరు చేయడం జరిగింది. 2016-17వ సంవత్సరంలో, అంటే ఈ సంవత్సరం 1,52,024 దరఖాస్తులకు గాను రూ.35.21కోట్లు మంజూరు చేయడం జరిగింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు కూడా కేంద్రప్రభుత్వం నుండి వచ్చేవి 5,515 కేంద్ర ప్రభుత్వం రూ.3.75కోట్లు మంజూరు చేసింది. 2015-16వ సంవత్సరంలో 10,563 మంది విద్యార్థులకు రూ.8,97,54,000 కేంద్రప్రభుత్వం మంజూరు చేసింది. 2016-17వ సంవత్సరంలో 10,722 మంది విద్యార్థులకు గాను రూ.8,00,95,054 వచ్చింది. కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేసినట్లు సభ్యులకు తెలియాలి.

MR. CHAIRMAN: Minister Garu, you have to answer. Today, we are having Short Discussion.

డా. పల్లె రఘునాథరెడ్డి: అధ్యక్షా, అయిపోతుంది. కేంద్రప్రభుత్వం నుండి వచ్చే Merit-cum-means వివరాలు అడగకుండా ఒకసారి చెబుతాను. Merit-cum-means లో226 మంది విద్యార్థులకి రూ.25 లక్షలు మంజూరు చేయడం జరిగింది. 1,156 మంది విద్యార్థులకు రూ.3 కోట్ల 18 లక్షలు మంజూరు చేయడం జరిగింది. 2016-17వ సంవత్సరంలో 1057 మంది విద్యార్థులకు రూ. 3 కోట్ల 2 లక్షలు మంజూరు చేయడం జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్న మాత్రం మైనారిటీ విద్యార్థుల కోసం ఏ విధంగా ఆరాటపడుతున్నారో నాకు అర్థం అయిపోతోంది. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య కాలంలో 80, 90 వేల మంది విద్యార్థులకు మనం ఇచ్చిన దరఖాస్తుల కంటే తక్కువ దరఖాస్తులు ఇస్తున్నారు. అక్కడి నుండి స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నాము కాబట్టి, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఈ విషయాన్ని తెలిపిన వెంటనే శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ గారు వచ్చారు. రూ. 30 కోట్లు అదనంగా మంజూరు చేయండని చెప్పడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం నుండి ఇచ్చే విద్యార్థులకు కూడా శాచ్యురేషన్ పాయింట్‌లో ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అందరూ అభినందించాలి.

SRI MOHAMMAD JANI: Chairman Sir.

MR. CHAIRMAN: Mr. Jani, saab, anyhow today, you have to initiate the debate on Minorities and it is also placed in the Agenda.

## 2.సభా కార్యక్రమం – ప్రకటన

MR. CHAIRMAN: Today, there is a presentation on Amaravathi at 11-30 a.m. in the Committee Hall of the A.P. State Legislature and I request all the Members to take-part in the presentation.

Now, the House is adjourned Tea Break for 15 Minutes.

(Then, the House adjourned at 11-15 a.m.)

* * *

మ.1.20

(After Tea-Break the House Re-assembled at 1.26 p.m.)
(Hon'ble Chairman in the Chair)

* * *

## 3.సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావన

MR. CHAIRMAN: Now Special Mention. Sri Boddu Nageswara Rao garu...

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లోని రెవెన్యూ వ్యవస్థలో గ్రామ స్థాయిలో సుమారుగా 27,000 మంది విఆర్ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 4,500 మంది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నియమితులైనారు. ఈ 27,000 మంది కేవలం రూ.6,400 గౌరవ వేతనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత పి.ఆర్.సి లో విడుదల అయిన జీ.ఓ.నెం.151 ప్రకారం కాంట్రాక్టు మరియు పొరుగు సేవల సిబ్బందికి వేతనాలు పెంచిన విధంగా వారికి కూడా వేతనాలు పెంచాలని వారు కోరుకుంటున్నారు. 4,500 మంది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ ద్వారా నియమితులైనవారు, దానిలో ఖాళీగా ఉన్న 10,000 పోస్టుల నియామకాలలో, రెగ్యులర్ నియామకాలు జరపాలని కోరుకుంటున్నారు. వీరికి 010 పద్దు క్రింద 2012 వరకూ వేతనాలు చెల్లించారు. ఆ తరువాత 010 పద్దును రద్దు చేశారు. వారికి సక్రమంగా ప్రతి నెలా

జీతాలు వచ్చే పరిస్థితి కూడా లేదు. కాబట్టి వారికి సంబంధించిన సమస్యలన్నీ కూడా ప్రభుత్వం పరిష్కారం చేయాలని, వారిని ఆదుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌లోని రెవెన్యూ వ్యవస్థలో గ్రామ స్థాయిలో సుమారుగా 27,000 మంది విఆర్ఏలు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 4,500 మంది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నియమితులైనారు. ఈ 27,000 మంది కేవలం రూ.6,400 గౌరవ వేతనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుత పి.ఆర్.సి లో విడుదల అయిన జీ.ఓ.నెం.151 ప్రకారం కాంట్రాక్టు మరియు పొరుగు సేవల సిబ్బందికి వేతనాలు పెంచిన విధంగా వారికి కూడా వేతనాలు పెంచాలని వారు కోరుకుంటున్నారు. 4,500 మంది ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ ద్వారా నియమితులైనవారు, దానిలో ఖాళీగా ఉన్న 10,000 పోస్టుల నియామకాలలో, రెగ్యులర్ నియామకాలు జరపాలని కోరుకుంటున్నారు. వీరికి 010 పద్దు క్రింద 2012 వరకూ వేతనాలు చెల్లించారు. ఆ తరువాత 010 పద్దును రద్దు చేశారు. వారికి సక్రమంగా ప్రతి నెలా జీతాలు వచ్చే పరిస్థితి కూడా లేదు. కాబట్టి వారికి సంబంధించిన సమస్యలన్నీ కూడా ప్రభుత్వం పరిష్కారం చేయాలని, వారిని ఆదుకోవాలని తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

## 4.అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమంపై లఘు చర్చ

MR. CHAIRMAN: Now short discussion on Minorities Welfare.

మ. 01.30

శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్: అధ్యక్షా, ఈ రోజు ముఖ్యంగా మైనారిటీల యొక్క సంక్షేమం మీద షార్ట్ డిస్కషన్‌కు అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ రోజు ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2014 వ సంవత్సరం నుండి ఈ రాష్ట్ర జనాభా ప్రకారంగా చూసుకుంటే, గత 23 జిల్లాలలో రాష్ట్రం సంయుక్తంగా ఉన్నప్పుడు ఈనాడు 13 జిల్లాలుగా విడిపోయిన తరువాత, మైనారిటీ వర్గాల యొక్క జనాభా 8 శాతానికి తగ్గిపోయింది. అయినప్పటికీ కూడా ఈనాడు మైనారిటీల మీద వారిలో ఉన్న పేదరికం, అవిద్య, నిరుద్యోగాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మైనారిటీల అభ్యున్నతి కోసం, వారి వికాసం కోసం అనేక రకాలుగా ఆదుకుంటున్నారు. గతంలో అనగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీలకు ఏ పథకాలు అయితే అమలు చేయడం జరిగిందో దానికంటే మిన్నగా, దానికంటే మరింత ఎక్కువగా ఈనాడు బడ్జెట్‌లో కేటాయింపులు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా అందరూ గమనించవలసిన అవసరం ఉంది.

అధ్యక్షా, 23 జిల్లాలతో కూడుకున్న సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో రూ.170కోట్లు, రూ.150 కోట్లు, రూ.200కోట్ల కంటే ఎక్కువగా ఏ సంవత్సరంలో కూడా మైనారిటీల సంక్షేమం కోసం ఖర్చు పెట్టలేదు. కానీ, ఈనాడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మొదటి సంవత్సరంలోనే దాదాపుగా రూ.350 కోట్లు, ఆ తరువాత రూ.810కోట్లు, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.840కోట్లు కేటాయించారు. ఆయన ఒక మంచి సదుద్దేశ్యంతో, సుహృద్భావంతో బడ్జెట్ కేటాయించిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న చొరవకు నేను ఈ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, సచార్ కమిటీ నివేదికల ద్వారా, రంగనాథ్ మిశ్రా కమీషన్ ద్వారా ఏవైతే వాస్తవాలు ఈనాడు వచ్చాయో, వాటికి ప్రతిరూపంగా ఆ సమస్యలను సాధించడానికి ఈనాటి బడ్జెట్‌లో ప్రాముఖ్యత

కల్పించడమనేది ఈనాడు ప్రముఖంగా కనిపిస్తున్న విషయం. ముఖ్యంగా విద్యకోసం శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమైన అంశంగా భావించి, అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఆ రకంగా విద్యకోసం, విద్యను అభ్యర్థిస్తున్న వారి కోసం ఎక్కువగా డబ్బులు ఖర్చు పెడుతున్నారు. అలాగే, దాదాపుగా రూ.250 కోట్లు ఫీజు రీయింబర్సుమెంటు కోసం కానీ, అలాగే పోస్టు మెట్రిక్, ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్పులు కానీ, ఈనాడు ప్రభుత్వ పరంగా ఆ విద్యార్థులకు అందించడం జరుగుతోందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ఈనాడు పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్పులలో గనుక చూసుకున్నట్లయితే, 1,34,350 మందికి ఈనాడు ఇవ్వడం జరుగుతుంది. ఇప్పుడు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులు ఉన్నాయో, వాటిపైన కూడా ఎక్కువ దృష్టిపెట్టవలసిన అవసరం ఉంది. ఈనాడు కేంద్రప్రభుత్వం ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులు కూడా ఇవ్వడం జరుగుతోంది. గత సంవత్సరంలో దాదాపు రూ.36కోట్ల 38 లక్షలు 1,56,832 మందికి స్కాలర్‌షిప్పుల రూపంలో ఇవ్వడం జరిగింది. వాస్తవానికి 2,19,000 మంది విద్యార్థులు ఈ ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్పుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, దాదాపు 1,55,732 మందికి స్కాలర్‌షిప్పులను అందించడం జరిగింది. ఇంకా 60,000ల పైబడిన విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు రాక నిరాశ చెందిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ప్రభుత్వం గమనించవలసిన అవసరం ఎంతైనా ఉందని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులకు సంబంధించి ఏవైతే డిమాండ్లు ఉన్నాయో, వాటికి సంబంధించి సుమారు రూ.30కోట్లు కేటాయించాలని అందుకోసం ప్రభుత్వపరంగాను, మంత్రుల పరంగాను, డిపార్టుమెంటు పరంగాను అందరూ సానుకూలంగా స్పందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆ రకంగా అదనపు బడ్జెటును కేటాయించేందుకు ఈనాడు చర్యలు తీసుకుంటున్నారు. ఇది మైనారిటీ వర్గాలకు చాలా సంతోషదాయకమైన విషయం. కాబట్టి, ఈ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పుల కోసం ఉన్నటువంటి డిమాండును సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ఎందుకంటే, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులను ఏ విధంగా ఇస్తున్నారో, అదే రకంగా ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులను కూడా ఈనాడు అందరు విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తున్నారు. అవి సత్ఫలితాలు సాధించాలని ఈ సందర్భంగా తమ ద్వారా గౌరవ మంత్రిగారికి విన్నవించుకుంటున్నాను.

అలాగే, మైనారిటీల ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా కూడా గతంలో కంటే ఎక్కువ మందికి స్కాలర్‌షిప్పులు ఇవ్వడం జరుగుతుంది. గతంలో కేవలం నామమాత్రంగా మాత్రమే స్కాలర్‌షిప్పులు ఉండేవి. మొత్తానికి 10 సంవత్సరముల కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో ఈ economic support schemes సరిగ్గా అమలు జరిగేవే కాదు. ఈనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పేదవర్గాల వారిని దృష్టిలో పెట్టుకుని, గతంలో దాదాపు రూ.60 కోట్లు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇవ్వడమే కాకుండా, 13,022 మందికి ఋణ సహకారాన్ని కూడా అందించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా గతంలో కంటే, రూ.16 కోట్లను అదనంగా ఇచ్చి, రూ.86 కోట్లను బడ్జెట్‌లో అలొకేషన్ చేయడం కూడా ఆనందదాయకమైన విషయమని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. అయితే, ఇక్కడ డిమాండ్ చూస్తే, ఎక్కువగా ఉంది. అధ్యక్షా, మీ ద్వారా నేను మంత్రి గారి దృష్టికి తీసుకువచ్చేదేమంటే – ఈనాడు మైనారిటీ వర్గాల వారు చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునేవారు. టీషాపు నడిపే వాళ్లు, మటన్ షాపు నడిపేవాళ్లు గానీ, సైకిల్ షాపు, మెకానికల్ షాపు నడిపేవాళ్లు గానీ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవితం గడుపుతున్నారు. వారికి కావాల్సిన మూలధనం రాబట్టలేని పరిస్థితుల్లో చాలీచాలని జీవితం గడుపుతున్నారు. ఈనాడు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా సబ్సిడీపై లక్ష రూపాయల వరకు రుణాలిచ్చే విధంగా ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరముంది.

ఆ రకంగా మెరుగైన జీవితాన్ని గడపడానికి అవకాశం కల్పించాల్సిన అవసరముంది. కేవలం 13,000 మందికి మనం ఇస్తున్నాము. ఇంత తక్కువగా ఇవ్వడానికి బ్యాంకుల సహకారం లేకపోవడమే కారణం. బ్యాంకుల్లో కూడా పద్ధతి ప్రకారం రెండు, మూడు నెలల వరకు అప్లికేషన్లు తీసుకోవడం, ఆ తరువాత నెలా, నెలన్నర రోజుల్లో అప్లికేషన్లన్నీ జాయింట్ వెరిఫికేషన్ చేసే పరిస్థితి ఉండాలి. అలాకాకుండా, అప్లికేషన్లు పెట్టుకున్న వాళ్లకి ఆరునెలలు, 8 నెలలు, సంవత్సరం గడిచినా కూడా జాయింట్ వెరిఫికేషన్ జరగకుండా, పేర్లు రాబట్టడంలో, సబ్సిడీలు డిపాజిట్ చేయడంలో కాలయాపన జరగడం మూలంగా వాళ్లలో నిరాశ, నిస్పృహ వస్తుంది. మనం చేయాల్సినవి చేస్తున్నాం గానీ, సకాలంలో ఆర్థిక పరమైన సహకారం అందేలా బ్యాంకులతో మాట్లాడి, వారికి టైం బౌండ్ ప్రోగ్రాం ప్రకారం ఇచ్చే పరిస్థితి ఉండాలి. అంతేగాకుండా, ఏ బ్యాంకులకైతే మనం అప్లికేషన్లు పంపిస్తున్నామో, ఆ బ్యాంకులు కూడా వాటి మీద శ్రద్ధ చూపించడం లేదు. వాళ్లని దరిదాపులకు రానివ్వకుండా చూస్తాం, చేస్తామని బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పిస్తున్నారు. కాబట్టి, 5, 10 మందికి ఏవైతే బ్యాంకులివ్వాలో, వారు సత్వరం ఇచ్చే విధంగా చూడాలి. ఒకవేళ యూనిట్ సరిగ్గా లేకపోతే, దానికి కారణాలు వ్రాసి తిప్పి పంపే పరిస్థితి ఉండాలి. అందులో కూడా 5, 10 అప్లికేషన్లు బదులుగా, 15, 20 అప్లికేషన్లు పంపిస్తే దాని ప్రకారం అర్హులైన వారికందరికీ రుణాలివ్వడానికి అవకాశముంటుందనే విషయాన్ని వాళ్లు గమనించాలి. ఈ సంవత్సరం రూ.86 కోట్లు ఇచ్చారు. నేను ఒక్కటే కోరుతున్నాను. ఈనాడు పేదరికంలో ఉన్నవాళ్లకి 13, 14 వేల మందికి ఇచ్చుకుంటూ పోతే ఈ రాష్ట్రంలో 45 లక్షల మైనారిటీ వర్గాల జనాభా ఉంది. కాబట్టి, దీన్లో 80 శాతం మంది పేదరికంలో ఉన్న వాళ్లు ఉన్నారు. అధిక సంతానంతో ఉన్నవాళ్లు, కనీస అవసరాలు కూడా తీర్చుకోలేని వాళ్లు ఉన్నారు. ఈనాడు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పోరేషన్ ద్వారా కనీసం 20 వేల మందికి లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలి. బీసీ కార్పోరేషన్‌లో ఉన్న నాయీ బ్రాహ్మణులకు, రజకులకు లక్ష రూపాయలు యూనిట్ కాస్ట్ పెట్టారు.

మ.1.40

ఇక్కడకు వచ్చేసరికి రూ.20,000, 25,000లు అని చెప్పి తక్కువ రుణాలు ఇవ్వడం మూలంగా పర్పస్ సర్వ్ కాదు. వాళ్ల జీవితంలో మార్పు రాదు. మనం ఇచ్చేది పూర్తి స్థాయిలో వారికి అవసరమైన మొత్తం ఇచ్చే ప్రయత్నం చేయాలి. కొన్ని జిల్లాల్లో మాకు వచ్చిన గ్రాంటు ఇంతే, మీరు ఆటో కొనుక్కుంటారో, వ్యాపారం చేసుకుంటారో తెలియదు. రూ.2 లక్షలు, లక్ష రూపాయలు మేము ఇవ్వలేము, మీకు రూ.20,000లు లేదా రూ.25,000 ఇస్తామని ఏదో పప్పుబెల్లాలు పంచిపెడుతున్నట్లుగా క్రియేట్ చేస్తున్నారు. ఈ రకమైన విధానం మారాలి. ఏ యూనిట్‌కి ఎంత కాస్ట్ ఉంటుందో దానిని పూర్తిగా వారికి ఇచ్చే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు మైనారిటీ వర్గాలలో ఉపాధి అవకాశాలు కల్పించడానికి ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాములను మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిర్వహించడం జరుగుతోంది. మా శాఖకు సంబంధించి ముఖ్యకార్యదర్శి, శ్రీ రావత్‌గారి లాంటి మంచి అధికారులు వచ్చారని నేను గర్వంగా చెబుతున్నాను. నేనే కాదు స్వయంగా ముఖ్యమంత్రిగారే చెప్పారు. సిన్సియర్‌గా పనిచేసే ఒక మంచి అధికారి రావత్ గారు అని ఆయనే చెప్పారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా పల్లె రఘునాథరెడ్డి గారు ఎంతో ప్రయాసపడి మైనారిటీలలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. 2015-16వ సంవత్సరంలో రూ.8 కోట్లు ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్‌కు ఇవ్వడం జరిగింది. కానీ, రూ.3.08 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. అంటే సుమారు రూ.5 కోట్లు మిగిలిపోయాయి. 2016-17 వ సంవత్సరంలో రూ.16.08 కోట్లు ప్రభుత్వం ఉదారంగా కేటాయించింది. కేవలం రూ.9 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. అక్కడా రూ.5 కోట్లు మిగిలిపోయింది. మళ్లీ ఈ సంవత్సరం కూడా

రూ.16.08 కోట్లు ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్‌కు కేటాయించింది. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్‌కు ఖర్చుకాకుండా రూ.10 కోట్లు డిపార్ట్‌మెంట్ దగ్గర ఉన్నదంటే అన్నీ ఉండి కూడా ఈనాడు ఏమీ చేయలేకపోతున్నట్లు కనబడుతోంది. ఈనాడు ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ చాలా అవసరం అధ్యక్షా. కేవలం, 8వ తరగతి, 10 వ తరగతి చదివి మానేసిన వారికి డ్రైవింగ్ నేర్పించడం, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు నేర్పించడం వంటివి చేస్తే ఎంతో మేలు కలుగుతుంది. ఆడవారు బురఖా వేసుకుని, ఘోషాతో ఇంట్లో ఉంటారు కాబట్టి వారిపై కూడా దృష్టి సారించవలసిన అవసరం ఉన్నది. మహిళలకు ప్రత్యేకమైన ఉపాధి కల్పించి ఇళ్లలో ఉండే వారు కూడా ఏదైనా ఉపాధిని సంపాదించుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలి. అందుకు అవకాశాలను పెంపొందించుకోవాలి. కాబట్టి ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు ఖర్చు అయినప్పటికీ, కానప్పటికీ ఉదారంగా రెండు సంవత్సరాలుగా రూ.16, 16 మొత్తం రూ.32 కోట్లు ఇచ్చిందంటే మైనారిటీల యొక్క స్థితి గతులను మార్చడానికి ఇది తోడ్పడిందని నేను మనవిచేస్తున్నాను.

అంతేకాకుండా, జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నారు. పదవ తరగతి చదువుకున్న వారి నుండి పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారికి కూడా జాబ్‌మేళాలను విజయవాడ, నెల్లూరులో నిర్వహించారు. ఈనాడు గుంటూరులో నిర్వహిస్తున్నారు. అధ్యక్షా, నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉన్నదంటే, పెద్ద పెద్ద చదువులు చదువుకున్న వారు కూడా సుమారు 5,000 మందికి తక్కువ కాకుండా జాబ్ మేళాలకు వస్తున్నారు. అయితే, అక్కడ కేవలం 100, 200, 1000 మంది వరకూ మాత్రమే ఉద్యోగాలు వస్తున్నాయి. మిగతావారికి రావడం లేదు. పది, పదిహేను శాతం కంటే ఎక్కువ మందికి ఉద్యోగాలు రావడం లేదు. కాబట్టి, మిగతా నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ అవసరం ఉంది, కమ్యూనికేషన్స్ ట్రైనింగ్ అవసరం ఉన్నది. ఒకరు బి.టెక్ చదివి ఉంటారు, ఒకరు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివి ఉంటారు, అయినా నేడు ఉన్న పరిస్థితుల్లో ఆ ఉద్యోగం సంపాదించుకునేందుకు అవసరమైన ట్రైనింగ్ ఇవ్వవలసిన అవసరం ఉన్నది. ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్‌కు ఏవైతే నిధులు ఉన్నాయో, వాటితో పదవ తరగతితో చదువు ఆపివేసి, చదువు మధ్యలో ఆపి ఖాళీగా ఉన్నవారికి, పై చదువులు చదివి కూడా ఉద్యోగాలు రాక ఖాళీగా ఉన్నవారికి శిక్షణనిచ్చి కనీసం ఒక నెల రోజులు స్టైఫండ్ ఇచ్చి, భోజనాలు పెట్టి, మంచి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. నిరుద్యోగులెవరైతే ఉన్నారో వారికి తగిన ఉద్యోగాలు వచ్చేందుకు, ఏ రకమైన ఉద్యోగానికి ఏ శిక్షణ అవసరమో దానిని ఇవ్వవలసిన అవసరం ఉన్నది.

ఈనాడు బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్స్, అలాగే, కొత్తగా పెట్టిన కాపు కార్పొరేషన్ వంటివి పబ్లిక్ సర్వీస్ కమీషన్, ఐఎఎస్, గ్రూప్ 1 వంటి పోటీ పరీక్షలకు శిక్షణనిస్తున్నాయి. అటువంటి వాటిపై కూడా దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా మంత్రిగారికి తమ ద్వారా మనవిచేస్తున్నాను అధ్యక్షా.

ప్రభుత్వ పరంగా అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. అందులో భాగంగా "దుల్హన్ పథకం" ఒకటి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.25,000లు ఇచ్చేవారు. అన్ని జంటలకు కలిపి సమష్టిగా సామూహికంగా వివాహాలు జరిపేవారు. దానిని ఆనాడు అగౌరవంగా భావించే పరిస్థితి ఉండేది. కానీ, ఈనాడు ఎవరైనా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకుంటే వివాహ ఖర్చులకు రూ.50,000లు నేరుగా బ్యాంకులలో జమ చేస్తున్నారు. అయితే, ఈ పథకం విషయంలో కొన్ని విషయాలను మంత్రిగారి దృష్టికి తీసుకువస్తాను. డబ్బులు ఇచ్చే క్రమంలో 2015-16 సంవత్సరానికి రూ.50 కోట్లు కేటాయించారు. ఇది మంచి ప్రోత్సాహంగా నేను భావిస్తున్నాను. ఆదరణ లభించిన కార్యక్రమాల్లో ఇది ఒకటి. ఈ సంవత్సరం రూ.60 కోట్లు కేటాయించారు. అయితే, ఇందులో రెండు విషయాలను మీ దృష్టికి తీసుకువస్తాను. పెళ్లికి రెండు, మూడు రోజుల ముందు రూ.50,000లు జమ చేస్తే ఆడపిల్ల తల్లిదండ్రులకు వస్తాయి. అలా కాకుండా పెళ్లి అయిన రెండు నెలల తరువాత, మూడు నెలల తరువాత జమ చేస్తే, ఆ సొమ్మును

అత్తవారు కట్నంగా తీసుకుంటున్నారు. పేదవారు ఎవరైతే అప్పులు చేసి పెళ్లి చేస్తున్నారో వారికి ఇది ఉపయోగపడకుండా పోతున్నది. కాబట్టి, ఈ రూ.50,000లు పెళ్లికి కనీసం ఒక రోజు ముందైనా సరే బ్యాంకుల్లో ఇచ్చే ఏర్పాటు చేయాలి. అయితే, ఈ పథకంలో ఎక్కువ సర్టిఫికేట్లను సబ్మిట్ చేయమని అడుగుతున్నారు. అయితే, ముస్లిం వివాహాలలో నిఖానామా వ్రాస్తారు. ఆ పుస్తకం ఒకటే పెళ్లి జరిగినట్లుగా ఆధారం అవుతుంది. మళ్లీ సర్టిఫికేట్ కావాలంటే ఖ్వాజీదారు రూ.5,000 నుండి రూ.10,000లు అడుగుతున్నారు. మీకు రూ.50,000 వస్తున్నాయి కదా, నాకు అయిదువేలన్నా ఇవ్వకపోతే ఎలా అని ఖ్వాజీదారు అడుగుతున్నారు. ఈ విధంగా ఎంతో కొంత ఇవ్వకపోతే మ్యారేజీ సర్టిఫికేట్ ఇవ్వనటువంటి పరిస్థితి ఉన్నది. నేను ప్రభుత్వాన్ని ఒక్కటే కోరుతున్నాను. పెళ్లి జరిగినట్లు వ్రాసుకునే నిఖానామా ఏదైతే ఉన్నదో అది పక్కాగా ఖ్వాజీదారు సంతకం పెట్టి ఉంటుంది. పెళ్లికి హాజరయిన వారు సాక్షి సంతకాలు చేస్తారు. కాబట్టి, నిఖానామాను అప్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. అంతేగానీ, ఆ తరువాత కూడా సర్టిఫికేట్ తీసుకోవడమనేది ఇబ్బందికరంగా మారుతున్నది. పెళ్లి అయిన తరువాత కూడా పెళ్లి అయినట్లు మరో సర్టిఫికేట్ అవసరమయ్యే పని లేకుండా చేయమని కోరుతున్నాను. ఎమ్మార్వో ఆఫీసు నుండి కూడా సర్టిఫికేట్ తీసుకురమ్మని అంటున్నారు. అక్కడ కూడా నాలుగైదువేలు ఇస్తేగానీ పని జరగడం లేదు. ఈ విధంగా ప్రభుత్వం ఉదారంగా ఇచ్చే రూ.50,000లలో మధ్యదాళారులే రూ.10,000,15,000, 20,000లు తీసుకునే పరిస్థితి ఈనాడు ఉన్నది. కాబట్టి, దీనిమీద ఆలోచన చేసి ఈ విధానాన్ని సరళతరం చేసి అర్హులైన వారికి రూ.50,000లు అందించే విధంగా ప్రయత్నం చేయాలని కోరుతున్నాను.

ప్రభుత్వ పరంగా మౌజన్లకు, ఇమామ్‌లకు జీతాలిచ్చే కార్యక్రమం భారతదేశంలో ఎక్కడా లేదు. ఇమామ్‌లకు రూ.5,000లు గౌరవ వేతనం, మౌజన్లకు రూ.3,000లు గౌరవ వేతనం ఇస్తున్నారు. ఎటువంటి ఆదాయం లేని మసీదులలో పనిచేసేవారికి రూ.8,000లు అందచేస్తున్నారు. ఆ విధంగా 5,000 ల మసీదులకు నెలకు నాలుగు కోట్ల రూపాయలు సంవత్సరానికి రూ.48 కోట్లను ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి ఇస్తున్నది.

మ. 01.50

అధ్యక్షా, ప్రభుత్వ పరంగా ఆలోచించవలసిన ఒక అంశం ఉంది. ఇమామ్‌లకు, మౌజాన్‌లకు గౌరవవేతనం చెల్లించేటపుడు ఆ మొత్తాన్ని మసీదు అక్కౌంట్‌లో జమచేస్తున్నారు. ఆ అక్కౌంట్ నుంచి ఇమామ్‌లకు రూ. 5 వేలు, మౌజాన్‌లకు రూ. 3 వేలు ఇవ్వడానికి కూడా వారికి చేతులు రావడం లేదు. వారు ఏమి చేస్తున్నారంటే, మేము రూ. 3 వేలు, రూ. 2 వేలు ఇస్తున్నాము కదా, ఆ రూ. 3 వేలు, రూ. 2 వేలతో పాటు మరొక రూ. 2 వేలు, రూ. 1000 లు చెల్లిస్తే, మొత్తం రూ. 5 వేలు, రూ. 3 వేలు అయిపోతుది. కాబట్టి ప్రభుత్వం ఇస్తోన్న రూ. 3 వేలు, రూ. 2 వేల మొత్తం మసీదుకు ఉంటుందని, ఈ రూ. 8 వేలల్లో రూ. 5 వేల చొప్పున మసీదు ఖాతాలో పెట్టుకుని సగం మొత్తాన్ని మాత్రమే వారికి చెల్లిస్తున్నారు. ఏదైనా కాదు, కూడదు అని ఎవరైనా అంటే ఉద్యోగం నుంచి తొలగిస్తారేమోననే భయం కూడా వారిలో ఉంది. ఆ రకంగా రూ. 8 వేలల్లో కేవలం రూ. 4 వేల నుంచి రూ. 5 వేలు చాలా మసీదుల్లో ఇమామ్‌లకు, మౌజాన్‌లకు చెల్లిస్తున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా చెల్లిస్తున్నారు. కానీ, కొన్నిచోట్ల కమిటీ వారు వారి ఇష్టానుసారంగా, వారి దయాదాక్షిణ్యాల మీద ఇమామ్‌లు మరియు మౌజాన్‌లకు గౌరవ వేతనం చెల్లించే పరిస్థితి ఉంది. మీరు ఏవైతే నిధులను మసీదులకు ఇచ్చారో ఇమామ్‌లు, మౌజాన్‌లకు గౌరవ వేతనం ఇచ్చినట్లుగా రసీదులు పెట్టినట్లయితేనే ఆ తర్వాత నెలల్లో ఇమామ్‌లు, మౌజాన్‌లకు గౌరవ వేతనాలను ప్రభుత్వం జారీచేస్తుందని ఆదేశాలను ఇవ్వవలసిన అవసరముందని నేను తమరిద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను. ప్రభుత్వం రూ. 40 వేల నుంచి రూ. 50 వేల చొప్పున గత 8 నెలల

ఇమామ్‌లు, మౌజాన్‌ల గౌరవవేతనం కోసం మసీదు అక్కౌంట్లల్లో జమచేయడం జరిగింది. మసీదు కమిటీ వారు తమకు గత 8 నెలల గౌరవవేతనాన్ని చెల్లించినట్లుగా ఇమామ్‌లు, మౌజాన్‌ల నుంచి ఒక ధృవీకరణపత్రాన్ని తీసుకోకపోతే ఈ నిధులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఉంటుందని, ఇమామ్‌లు, మౌజాన్‌లు సంతోషంగా ఉండలేరని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, షాదీఖానాల విషయంలోకూడా ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోంది. 2016-17 సంవత్సరంలో రూ. 12 కోట్లు షాదీఖానాల కోసం ప్రభుత్వం కేటాయించింది. ఈ సంవత్సరం కుడా రూ. 15 కోట్లు షాదీఖానాల కోసం ప్రభుత్వం కేటాయించడం జరిగింది. ఆనాడు శ్రీ చంద్రబాబు నాయుడు గారు షాదీఖానాలను ప్రారంభించడం జరిగింది. 1995 సంవత్సరం నుంచి 2004 సంవత్సరం వరకూ కూడా షాదీఖానాల కోసం నిధులను తెలంగాణ మరియు ఆంధ్ర ప్రాంతంలో కూడా ఇతోధికంగా ఇవ్వడం జరిగింది. ఆ రకంగా సుమారు 550 షాదీఖానాలను నిర్మించినపుడు కొన్ని బేస్‌మెంట్ లెవల్‌లో, ఇంకొన్ని లింటల్ లెవల్‌లో, మరొకొన్ని స్లాబ్ లెవల్‌లో ఉండిపోయాయి. కానీ, వాటి నిర్మాణం పూర్తికావడం లేదు. మళ్లీ కొత్త వాటిని మనం మంజూరు చేసుకుంటూ వెళుతున్నాము. గతంలో ప్రభుత్వం ఏదైతే షాదీఖానాలను మంజూరుచేయడం జరిగిందో, ఆ షాదీఖానాలలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానాలు ఏమి ఉన్నాయో, వాటిపై ప్రధానంగా దృష్టిపెట్టి తెలుగుదేశం మరియు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అసంపూర్తిగా ఉన్న అన్ని షాదీఖానాలను వెంటనే పూర్తిచేసి వాటిని మైనారిటీ వర్గాలు వినియోగించుకునే విధంగా చేయాలి. ఈ సంవత్సరం ప్రభుత్వం షాదీఖానాల కోసం మంజూరుచేసిన మొత్తం రూ. 15 కోట్లలో అగ్రభాగాన్ని అసంపూర్తిగా ఉన్న షాదీఖానాలను పూర్తిచేయడం కోసం వినియోగించవలసిన అవసరముందని నేను తమరిద్వారా మంత్రిగారికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాడు ఉర్దూభాష వికాసం కోసం రూ. 20 కోట్లను ప్రభుత్వం కేటాయించడం జరిగింది. గతంలో కూడా ప్రభుత్వం రూ. 20 కోట్లను మంజూరు చేయడం జరిగింది. కానీ, ఈ నిధులు పూర్తిగా ఖర్చవుతున్నట్లు కనిపించడం లేదు. ఈనాడు ఉర్దూభాష వికాసం కోసం ఏ రకంగా నిధులను ఖర్చుచేయాలని కూడా ప్రజల్లో అవగాహన లేదు. నేడు ఉర్దూ పాఠశాలల్లో కూర్చోడానికి టేబుళ్ళు, పుస్తకాలు కూడా లేవు. సరైన సమయంలో ఉర్దూ పుస్తకాలు కూడా రావడం లేదు. రాష్ట్రవిభజన జరిగిన తర్వాత 9వ షెడ్యూల్‌లో ఉందని మూడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ నేటికి ఉర్దూ అకాడమీని మనం విభజించుకోలేకపోయాము. ఉర్దూ అకాడమీలో నేటికీ తెలంగాణ అధికారులే కొనసాగుతున్నారు. వారి చెప్పుచేతల్లోనే ఉర్దూ అకాడమీ నడుస్తున్న మూలంగా ప్రభుత్వం గత సంవత్సరానికి మరియు ఈ సంవత్సరానికి రూ. 20 కోట్లు చొప్పున కేటాయించిన మొత్తం పూర్తిగా ఖర్చుకాలేదు. ఉర్దూ అకాడమీలో ఉద్యోగులు కూడా నామమాత్రంగానే ఉన్నారు.

అధ్యక్షా, ప్రభుత్వం దూదేకుల, నూర్‌బాష ఫెడరేషన్‌ను ఏర్పాటుచేయడం జరిగింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఆర్థిక సంవత్సరానికి రూ. 2 కోట్లు చొప్పున ఈ ఫెడరేషన్‌కు కేటాయించడం జరుగుతోంది. ఆ రకంగా గత మూడు సంవత్సరాలలో రూ. 6 కోట్లు దూదేకుల, నూర్‌బాష ఫెడరేషన్‌కు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నపటికీ, ఈ ఫెడరేషన్ ఇప్పటివరకూ ఉనికిలోకి రాలేదు. ఆ ఫెడరేషన్‌ను ఏర్పాటుచేయడం కోసం ఇంతవరకూ అధికారులు మరియు ప్రభుత్వం కూడా దృష్టి పెట్టలేదు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు ఈ అంశం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు సంబంధించినది అని అంటారు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారులు ఇది మైనారిటీ సంక్షేమ శాఖకు

సంబంధించినదని అంటారు. నేడు దూదేకుల, నూర్‌బాష వెనుకబడిన వర్గాలకు చెందిన వారు చాలా అసంతృప్తిగా ఉన్నారు. వెనుకబడిన తరగతుల్లో ప్రతి ఉపకులానికి కూడా నేడు ఒక ఫెడరేషన్ ఉంది. దూదేకుల, నూర్‌బాష ఫెడరేషన్‌ను ఉనికిలోకి తీసుకువచ్చి జిల్లా లేదా రాష్ట్రస్థాయిలో గానీ ఇప్పటివరకూ ఎటువంటి కమిటీలను ఏర్పాటుచేయకుండా ఉన్న మూలంగా వారు చాలా అసంతృప్తిగా ఉన్నారు. అవసరమైతే ప్రభుత్వం బి.సి.కమీషన్‌తో మాట్లాడి గత మూడు సంవత్సరాల నుంచి మంజూరుచేసిన రూ. 6 కోట్లతో దూదేకుల, నూర్‌బాష ఫెడరేషన్‌ను వెంటనే ఏర్పాటుచేయవలసిన అవసరముందని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, మంత్రిగారు సమచార మరియు పౌరసంబంధాల శాఖకు మాత్రమే కాక మైనారిటీల సంక్షేమ శాఖకు కూడా మంత్రిగా ఉండడం అదృష్టంగా నేను భావిస్తున్నాను. ఈ సభలో ఎప్పుడైనా మానవ వనరులకు సంబంధించి చర్చ వస్తే ఆయనే సమాధానం చెబుతారు. ఈనాడు పాఠశాల విద్య విషయంలో, ఉన్నత విద్య విషయంలో కూడా ఆయనకు పూర్తిగా అవగాహన ఉంది. ఈనాడు మైనారిటీ బాలుర కోసం 6 రెసిడెన్షియల్ పాఠశాలలు, బాలికల కోసం 3 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రెసిడెన్షియల్ పాఠశాలలకు స్వంత భవనాల కోసం నిధులను కేటాయించడం జరిగింది. కానీ, వాటిని వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. 3 సంవత్సరాలు గడిచినా వాటికోసం స్థలాలను కేటాయించలేదు. స్వంతభవనాల కోసం స్థలాలను కేటాయించకపోవడం వల్ల ఆ నిధులు బ్యాంకుల్లోనే ఉన్నాయి. విద్యార్థులు ప్రయివేటు భవనాలలోనే ఉంటున్నారు. మైనారిటీ విద్యార్థులు అక్కడే చదువుకోవడం, అక్కడే తినడం, అక్కడే పడుకోవడం నేను స్వయంగా చూసి వచ్చాను. వారికి ఆడుకోవడానికి కూడా స్థలం లేదు. గతంలో రూ. 84 కోట్లు, ఈ సంవత్సరం రూ. 100 కోట్లు రెసిడెన్షియల్ పాఠశాలల కోసం ప్రభుత్వం కేటాయించింది. అధికారులతో మాట్లాడి, రెసిడెన్షియల్ పాఠశాలల కోసం స్థలాలను కేటాయించి, ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగ పరచవలసిన అవసరముంది. మంచి కాంట్రాక్టర్లను నియమించి ఈ భవనాల నిర్మాణం విషయంలో ఇంకా జాప్యం జరగకుండా చేయవలసిన అవసరముందని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఉర్దూ భాష వికాసం కోసం నేడు ఎన్నో కార్యక్రమాలను చేపట్టవలసిన అవసరముంది. ఉర్దూ భాషను నేడు మాతృభాషగా భావించే వర్గం ఉంది. ఉర్దూ భాష పరాయి భాష కాదు, ఇది హిందూస్థానీ భాష అని చెప్పవచ్చు. శ్రీ మర్రి చెన్నారెడ్డి గారు ఎం.బి.బి.యస్. డిగ్రీని ఉర్దూ భాషలోనే చేశారు. శ్రీ ఎం. బాగారెడ్డి గారు తెలుగు కంటే ఉర్దూ భాషను ఎక్కువగా చదవగలరు, వ్రాయగలరు. మీరు కూడా ఉర్దూలో బాగా మాట్లాడగలరు. ఉర్దూ చదివే పిల్లలు ఉన్నారు కానీ, గత పది సంవత్సరాలుగా ఉర్దూలో బోధించే ఉపాధ్యాయులు లేరు. మొన్ననే 550 టీచర్ పోస్టుల కోసం డి.ఎస్సీ పరీక్షను నిర్వహించారు. కానీ, ఎస్సీ, ఎస్టీ, బి.సి. రిజర్వేషన్లు ఉండడం వల్ల ఆ పోస్టులు భర్తీకాలేదు. ఈనాడు గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయాన్ని గమనించి స్పెషల్ డి.ఎస్సీ పరీక్షను నిర్వహించాలని చెప్పిన తర్వాత కూడా ఇంతవరకూ ఆ ఫైల్ కదలలేదు. కాబట్టి మంత్రిగారు ఈ విషయంలో కూడా చొరవ చూపించవలసిన అవసరముందని ఈ సందర్భంగా నేను మనవిచేస్తున్నాను. నేను చెప్పిన అన్ని విషయాలపై మంత్రిగారు దయచేసి దృష్టి సారించి ఆ సమస్యలన్నీ పరిష్కరించే విధంగా కృషిచేయాలని తమరిద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను. మీరిచ్చిన ఈ అవకాశానికి నేను కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

మ. 02.00

శ్రీ సోము వీర్రాజు: అధ్యక్షా, సభ్యులంతా రెండు నిమిషాలు మాట్లాడిన తరువాత మంత్రిగారిని సమాధానమివ్వమనండి.

మిస్టర్ ఛైర్మన్: శ్రీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌గారు, శ్రీ పి.జె.చంద్రశేఖరరావుగారు, శ్రీ సోము వీర్రాజుగారు, శ్రీ గాదె శ్రీనివాసులునాయుడు గారు మాట్లాడాలి. సోమవారం మాట్లాడతారా?

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు: మీరు మాట్లాడమంటే మాట్లాడతాము సార్.

శ్రీ అంగర రామమోహన్ ( స్థానిక సంస్థలు – పశ్చిమ గోదావరి): అధ్యక్షా, ఈ చర్చను సోమవారం పెట్టుకుందాము.

శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్): అధ్యక్షా, సాంఘిక భద్రతా పథకాలకు సంబంధించి కూడా మాట్లాడాలి.

మిస్టర్ ఛైర్మన్: సోమవారం మాట్లాడదాము. Even if you want to talk on Minorities Welfare then, you give names of the Members. Okay, we will take-up those subjects on Monday for discussion. It is already 2-00 p.m.

Now, the House stands adjourned to meet again day-after-tomorrow i.e. on Monday, the 27th March, 2017 at 10.00 a.m.

(Then, the House was adjourned at 2-01 p.m. to meet again on Monday, the 27th March, 2017 at 10.00 a.m.)

* * *